



ఖాళీ ప్లాట్లపై కుస్తీ

- స్థలాలిచ్చి.. నిర్మాణంపై మడమ తిప్పిన గత ప్రభుత్వం
- ఇళ్లు కట్టుకోలేక ఖాళీగా వదిలేసిన పలువురు లబ్ధిదారులు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 27,283 ప్లాట్లు ఖాళీ
- ఇళ్ల మధ్యలో స్థలాలతో సమస్యాత్మకంగా సర్దుబాటు

కష్టతరంగా జగనన్న కాలనీల్లోని స్థలాల సర్దుబాటు

కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నాం.. స్థలాలే కాదు ఇళ్లు కూడా కట్టిస్తాం.. సకల సౌకర్యాలతో పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం.. అని గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో లే అవుట్లు వేసి లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేసింది. అయితే అప్పట్లో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంపై మాటమార్చింది. దీంతో పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఇలాంటి ఖాళీ ప్లాట్లు జగనన్న కాలనీలోని ప్రతీ లేఅవుట్లో వందల్లో ఉన్నాయి. ఖాళీ ప్లాట్లపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర ప్లాట్లు 27,283 ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి పంపిణీకి ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీచేసింది. అయితే ఇళ్ల మధ్య.. ఊళ్లకు దూరంగా.. కనీస సౌకర్యాలు లేని.. చిట్టడవులను తలపిస్తోన్న.. వర్షం పడితో చెరువుల్లా మారే లేఅవుట్లలోని ప్లాట్లను ఏమి చేయాలో.. ఎలా సర్దుబాటు చేయాలనే విషయంపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు పేరుతో పేదల కోసం అంటూ జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి స్థలాలను పంపిణీ చేసింది. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున స్థలాలు కేటాయించింది. అయితే ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు ముందుకు రాలేదు. కొందరు స్తోమతకు మించి అప్పులు చేసినా ఇళ్లను పూర్తిగా నిర్మించుకోలేక వదిలేశారు. దీంతో ఆయా కాలనీలు మొండిగోడలకు పరిమితమైన ఇళ్లు, పునాదుల దశలోనే ఉన్న ఇళ్లు.. అసలు నిర్మాణాలకే నోచుకోని ఖాళీ స్థలాలతో జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. అరకొర నిర్మాణాలతో ఉన్న ఇళ్లను పక్కన పెట్టి ప్రస్తుతానికి ఖాళీ స్థలాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే ఆ ఖాళీ స్థలాల సర్దుబాటు ప్రక్రియ అటు ప్రభుత్వానికి ఇటు రెవెన్యూ అధికారులకు కొత్త తలనొప్పులు తెచ్చి పెడుతోంది. ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలను, సగం నిర్మాణాలున్న స్థలాలను ఎలా సర్దుబాటు చేయాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. దీంతో స్థలాల సర్దుబాటు వ్యవహారం ఒక ప్రహసనంగా మారుతోంది. మొత్తంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 27,283 ఖాళీ స్థలాలు ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో ఖాళీగా పడి ఉన్న స్థలాలను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున పేదలకు స్థలాలను సర్దుబాటు చేయాల్సిందిగా రెవెన్యూ శాఖను ఆదేశించింది. అయితే ఆ ప్రకారం సర్వే చేస్తున్న అధికారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఒక లే అవుట్లో కొంత మంది ఇళ్లు కట్టుకుంటే.. మరికొందరు ఇళ్లు కట్టుకునే స్తోమత లేక ప్రభుత్వ సహాయం అందక ప్లాట్లను ఖాళీగా వదిలేశారు. అలా వదిలేసిన స్థలాలు చాలా వరకూ ఇళ్ల మధ్యలో ఉన్నాయి. ఈ సాంకేతిక సమస్య కారణంగా ప్రభుత్వం చెప్పిన 2, 3 సెంట్లు చొప్పున సర్దుబాటు చేసేందుకు వీలుపడడం లేదు. మరోవైపు ఆ స్థలాలనే వేరొకరికి ఇద్దామంటే, ప్రభుత్వం ప్రకటించిన స్థలాల కంటే చిన్నవి కావడంతో వాటిని తీసుకోవడానికి ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఆయా ఖాళీ ప్లాట్లను ఏమి చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సర్దుబాటు వ్యవహారం ఎప్పటికి కొలిక్కి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

నిర్మాణం మొదలైన స్థలాలను సర్దుబాటు చేయడం వీలుకాని నేపథ్యంలో ప్రభుత్వం లబ్ధిదారులకు అదనపు సహాయం ప్రకటించి ఆ ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా చేయూత ఇస్తుందని ఆశతో గతంలో మొదలుపెట్టిన అనేకమంది ఇళ్లు కట్టుకోలేక మధ్యలో ఆపేశారు. గుంటూరు జిల్లాలో 51,579 ఇళ్లు ఇంకా పూర్తి కావాల్సి ఉండగా 34,527 ఇళ్లు పునాదుల

అదనపు సహాయంతో ప్రోత్సాహం

దశలోనే ఉన్నాయి. బాపట్ల జిల్లాలో సొంత స్థలాలున్న 20 వేల మందితో కలిపి 50,457 ఇళ్లు నిర్మించ తలపెట్టగా వాటిలో 32 వేలు అసంపూర్తిగా ఉన్నాయి. అందులో సగం జగనన్న కాలనీల్లోనే ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 23,852 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. అయితే గతంలో గృహ రుణం మంజూరై ఇళ్లు నిర్మించుకోకుండా ఖాళీగా వదిలేసిన స్థలాలకు ప్రస్తుత ప్రభుత్వం అందజేసే సర్దుబాటు వర్తించదని అధికారులు చెబుతున్నారు.

కట్టుకోలేక వదిలేశారు

గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో స్థలాలు ఇచ్చి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టుకోవాలని సూచించింది. రాష్ట్రం వాటా కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆ డబ్బుతో ఇళ్లు కట్టుకోలేక నిరుపేదలు అనేక మంది స్థలాలను ఖాళీగా వదిలేశారు.

- గుంటూరు జిల్లాలో 247 లేఅవుట్లలో 73,932 ప్లాట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 63,823 ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా, శంకుస్థాపనకు నోచుకోకుండా 10,109 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వం వేసిన జగనన్న కాలనీల్లోని లే అవుట్లలో 29,854 మందికి ప్లాట్లు ఇచ్చారు. అయితే 10,500 మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేక వదిలేశారు.
- పల్నాడు జిల్లాలో 39,642 ప్లాట్లు వేసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయితే 9,481 ఇళ్లు పునాదుల దశలోనే ఉన్నాయి. 6,674 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాకపోవడంతో ఖాళీగా ఉన్నాయి.

లబ్ధిదారులకు రూ.50 వేలు

ఇళ్ల పనులు ప్రారంభించి మధ్యలో వదిలేసిన స్థలాలను సర్దుబాటు చేసే అవకాశం లేకపోవ డంతో లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.50 వేల సహాయాన్ని ప్రకటించింది. గుంటూరు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు 14,112 మందికి, బాపట్ల జిల్లాలో 15,334 మందికి, పల్నాడు జిల్లాలో 14,106 మందికి అదనపు ఆర్థిక సహాయం చేయనుంది.



అధ్వాన స్థితిలో నరసరావుపేటలోని కలెక్టరేట్ పక్కన ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం



నిధులున్నా.. మరమ్మతులు మమ

- ఎస్సీ వసతిగృహాల నిర్వహణపై నిర్లక్ష్యం
- మూడు నెలల క్రితం రూ.11.43 కోట్లు విడుదల
- పల్నాడు జిల్లాలో దారుణంగా పనుల తీరు
- గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అరకొరగానే..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రూపురేఖలు కోల్పోయిన మరుగుదొడ్లు.. పెచ్చులు ఊడు తున్న శ్లాబ్‌లు.. మెష్‌లు లేని కిటికీలు.. తలుపులు లేని గదులు.. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దోమల మధ్య.. ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు అల్లాడుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ హాస్టళ్ల నిర్వహణను గాలికి వదిలేశారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించేందుకు హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించింది. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు వసతిగృహాల్లో సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి నిధులు విడుదల చేసింది. అయితే సదరు పనులు చేపట్టడంలో అధికారుల్లో అడుగడుగునా అలసత్వం తాండవిస్తోంది. నిధులు ఉన్నా మరమ్మతులు పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. మూడు నెలల క్రితమే నిధులు విడుదలైనా నేటికి చాలా దగ్గర్ల పనులు చేపట్టలేదంటే అధికారుల అలసత్వం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నా పట్టించుకోవడంలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని 53 వసతి గృహాల్లో మరమ్మతులకు రూ.11.43 కోట్లు నిధులు విడుదలయ్యాయి. అయితే చాలా చోట్ల పనులు చేపట్టలేదని సాంఘిక సంక్షేమశాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో 16 వసతి గృహాలకు నిధులు కేటాయించినా ఒక్క దగ్గర కూడా పనులు పూర్తి చేయలేదు. గుంటూరు జిల్లాలో 23 వసతి గృహాలకు చాలా వసతిగృహాల్లో 50 శాతం పనులే జరిగాయి. బాపట్ల జిల్లాలో అన్ని వసతి గృహాల్లో పనులు చేపట్టగా మూడు చోట్ల 25 శాతం లోపు, 11 వసతి గృహాల్లో 50 శాతం లోపు పనులు జరిగాయి. పనులు జరుగుతున్న తీరు పరిశీలిస్తే ఇప్పట్లో అవి పూర్తయ్యే పరిస్థితి లేదని అర్థమవుతోంది. జూన్‌లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అప్పటి కల్లా మరమ్మతులు పూర్తి చేసేందుకు అధికారులు స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లా	వసతి గృహాలు	నిధులు (రూ.కోట్లలో)
పల్నాడు	16	2.76
గుంటూరు	23	4.13
బాపట్ల	14	4.54

సూర్యలంకకు మహర్దశ



- బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు
- అంతర్జాతీయ ప్రమాణాలతో సొబగులు
- బీచ్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి
- 45 రోజుల్లో నిధులు.. కేంద్రానిదే
పూర్తి బాధ్యత : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

బాపట్ల, గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సుందరమైన సూర్యలంక బీచ్ అత్యాధునికంగా.. సకల సౌకర్యాలతో.. పర్యాటకులను మరింత ఆహ్లాదప రచనున్నది. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద సూర్యలంక బీచ్ అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక సొబగులు అద్దుకోనుంది. బీచ్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు కింద సూర్యలంక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.97.52 కోట్లు మంజూరు చేసింది. సూర్యలంక బీచ్‌కి సంబంధించి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేకంగా దృష్టి సారించి 45 రోజుల్లోనే నిధులు సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. ఫిబ్రవరిలో కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాసిన పెమ్మసాని పలుమార్లు ఆయనను వ్యక్తిగతంగా కలిసి ఈ ప్రాజెక్టుకు సంబంధించి వివరాలు అందజేసి నిధులు రాబట్టడంలో విజయం సాధించారు. కేంద్రం విడుదల చేసిన నిధులను 7 అంశాలపై ఖర్చు చేయనున్నారు. రూ.15.43 కోట్లతో పర్యాటకుల అనుభూతిని పెంచేలా కార్యక్రమాలు, రూ.4.4 కోట్లతో షాపింగ్ స్ట్రీట్, రూ.7.8 కోట్లతో రవాణా సదుపాయాలు, రూ.11.69 కోట్లతో బీచ్ సమీపంలోని కాల్వ అభివృద్ధి, రూ.19.4 కోట్లతో ఎక్స్‌పీరియన్స్ జోన్, రూ.12.8 కోట్లతో సదుపాయాలు, రూ.5.97 కోట్లతో సౌకర్యాలు అందుబాటులోకి తేనున్నారు. సూర్యలంకకు ప్రాజెక్టు మంజూరు చేయించడం తనకు చాలా ఆనందంగా ఉందని పెమ్మసాని గురువారం తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

సమకూరే వసతులు..

- బ్లూఫ్లాగ్ గుర్తింపు దక్కేలా వసతుల కల్పన
- కొత్తగా రిసార్టుల నిర్మాణం, తాత్కాలిక గదుల ఏర్పాటు
- పర్యాటకులను ఆకర్షించేలా బీచ్ ఆధునికీకరణ
- దేశీయ సాంప్రదాయ ఫుడ్ స్టాళ్లు, షాపింగ్ స్ట్రీట్ ఏర్పాటు
- పిల్లలకోసం ప్రత్యేక ఆట వస్తువులు, పార్కు నిర్మాణం

చక్రం తిప్పిన పెమ్మసాని..

స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద కేంద్రం తొలుత రూ.600 కోట్ల బడ్జెట్‌తో దేశ వ్యాప్తంగా ఆరు ప్రాజెక్టులను చేపట్టింది. ఈ పథక నిర్వహణలో సాంకేతిక సర్దుబాట్ల బాధ్యతను పెమ్మసాని ప్రత్యేకంగా చేపట్టారు. ఈ క్రమంలో ఆరు ప్రాజెక్టులను 14 ప్రాజెక్టులుగా మార్పు చేయించారు. బడ్జెట్‌ను కూడా రూ.600 నుంచి 1,000 కోట్లకు పెంచేలా చేశారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టును కూడా ఇందులో జత చేయించడంలో పెమ్మసాని చక్రం తిప్పారు. సూర్యలంక బీచ్ ప్రాముఖ్యత, పర్యాటకంగా పెరగనున్న ఆదరణ, తదితర వివరాలను సవివరంగా డీపీఆర్ ద్వారా కేంద్ర పర్యాటకశాఖకు పలుమార్లు పెమ్మసాని వివరించడంతో సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్రం నిధులను విడుదల చేసింది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (శుక్రవారం సాయంత్రం) | సహరి : 4.49 (శనివారం ఉదయం)

పంచాయతీ ఉప ఎన్నికలు.. ప్రశాంతం

- కోరం లేక ఏడు చోట్ల ఎన్నిక వాయిదా
- అచ్చంపేట ఎంపీపీ పీఠంపై టీడీపీ జెండా

(నరసరావుపేట, అచ్చంపేట - ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పంచాయతీల ఉప సర్పంచ్, మండల పరిషత్ ఉపాధ్యక్ష, అచ్చంపేట ఎంపీపీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. కోరం లేకపోవడంతో ఏడు చోట్ల ఎన్నికలు వాయిదా వేశారు. నరసరావుపేట, కారంపూడి మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక వాయిదా పడింది. నరసరా వుపేట మండలం పాలపాడు పంచాయతీలో వార్డు సభ్యుడి మృతితో ఉపసర్పంచ్ ఎన్నికను అధికారులు వాయిదా వేశారు.

దుర్గి మండలం ధర్మవరం, రొంపిచర్ల మండ లం తురుమెళ్ల, పిడుగురాళ్ల మండలం కొత్తవెల్లంపల్లి, పిన్నెల్లి, మాచవరం మండలం మాచవరం పంచాయతీల ఉప సర్పంచ్ ఎన్నికలను కోరం లేక వాయిదా వేశారు. పిడుగురాళ్ల మండలం కోనంకి పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఇర్ల సాంబయ్య, కామేపల్లి పంచాయతీకి రొడ్డా మంగమ్మ ఎన్నికయ్యారు. మాచవరం మండలం వేమవరం ఉపసర్పంచ్‌గా ఇప్పల కోటేశ్వరమ్మ, దాచేపల్లి మండలం కేసానుపల్లిలో చెట్టిపోగు వెంకమ్మ, మాచర్ల మండలం రాయవరంలో పెండ్లి వెంకటకుమారి, జమ్మలమడకలో కొండ పెదఅంకయ్య ఎన్నికయ్యారు. కారంపూడి మండలం నరమాలపాడు ఉప సర్పంచ్‌గా షేక్ హస్మా, ఒప్పిచర్లలో గంగనపల్లి పుష్పలత, ఇనపరాజుపల్లిలో తగరం రత్నమేరి, కారంపూడిలో బానవతు సరస్వతిబాయి, చింతపల్లిలో ఉన్నం మాధవి, పేటసన్నెగండ్లలో తొండేటి రాజేశ్వరి, కాచవరంలో కొత్తపల్లి లక్ష్మమ్మ, చినగార్లపాడులో జిడుగు సుమతి, దుర్గి మండలం ముటుకూరులో దొండపాటి చెన్నయ్య, వెల్దుర్తి మండలం బోదలవీడులో ధర్మవరపు శ్రీనివాసరావులు ఉప సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. రొంపిచర్ల మండలం కొత్తపల్లిలో గంటా కోటేశ్వరరావు, అలవాలలో పాపసాని వరలక్ష్మి, వడ్లమూడివారిపాలెంలో వడ్లమూడి రాంబాబు, అన్నవరప్పాడులో గోపు వెంకటరెడ్డి, అచ్చెయ్యపాలెంలో గాడిపర్తి సత్యనారాయణ, నరసరావుపేట మండలం అల్లూరివారిపాలెంలో యక్కంటి లక్ష్మి, కాకానిలో అప్పలనేని వీరవసంతరాయ, బెల్లంకొండ మండలం వెంకటాయపాలెంలో భూక్యా నాగమ్మ, బెల్లంకొండలో కొండవీటి షేక్ అబ్దుల్‌రజాక్, అమరావతి మండలం నెమలికల్లులో షేక్ కరిముల్లాలు ఉప సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.రాజుపాలెం మండలం ఉప్పలపాడులో రామవత్ మంగ్లిబాయి, అంచులవారిపాలెంలో దబ్బూరిలో అయ్యారయ్య, కుబద్‌పురంలో అంచుల సీతారావమ్మ, కొత్తబోదనంలో తోట శ్రీనివాసరావు, ముప్పాళ్ల మండలం మాదలలో తిరుమలశెట్టి సైదుబాబు, రుద్రవరం పులివిచర్లలో అప్పారావు, వినుకొండ మండలం చీకటీగలపాలెంలో ములకా అనంతలక్ష్మి, శావల్యాపురం మండలం గుంటుపాలెంలో మద్దినేని అంజనేయులు, ఈపూరు మండలం కొండాయపాలెంలో తరుమళ్ల త్రివేణి, నూజెండ్ల మండలం జంగాలపల్లిలో సొమ్మనబోయిన రామకృష్ణలు ఉపసర్పంచ్‌లు ఎన్నికయ్యారు.



అచ్చంపేట ఎంపీపీగా ఎన్నికైన భూక్యా స్వర్ణమ్మ బాయికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రత్యేకాధికారి హనుమంతరావు, పక్కన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట ఎంపీపీగా స్వర్ణమ్మబాయి

అచ్చంపేట మండల ఎంపీపీ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. మాదిపాడు పంచాయతీలోని గింజుపల్లి తండాకు చెందిన ఎంపీటీసీ భూక్యా స్వర్ణమ్మబాయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 17 మంది ఎంపీటీసీలకు ఒకరు మృతి చెందగా మిగిలిన 16 మందిలో పది మంది మాత్రమే ఎన్నికకు హాజరయ్యారు. ఆరుగురు వైసీపీ సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో మిగిలిన సభ్యుల ఆమోదంతో స్వర్ణమ్మబాయిని ఎంపీపీగా ప్రకటించిన ఎన్నికల ప్రత్యేక అధికారి వీ హనుమంతరావు ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నిక సందర్భంగా ఏఆర్ ఏఎస్పీ సత్యరాజు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్వచ్ఛందంగా మద్దతు : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట ఎంపీపీ ఎన్నికల్లో పార్టీ ఫిరాయింపు జరగలేదని ఎంపీటీసీలు స్వచ్ఛందంగా వచ్చారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఎన్నిక అనంతరం ఎంపీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అభివృద్ధిని ఆకాంక్షించి తొమ్మిది మంది మద్దతు తెలిపారన్నారు.



గుంటూరు-నడికుడి మార్గంలో
రైళ్ల వేగం 130 కి.మీ
- రూ. 17.31 కోట్లతో ట్రాక్ వెంట సరిహద్దు గోడ నిర్మాణం
- టెండర్ల ప్రక్రియ ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే

5 గురుకులాల్లో ప్రవేశాలకు 13న పరీక్ష

రూ.13 కోట్లతో డీసీఎంఎస్ బడ్జెట్ ఆమోదం



5

చెరువులో పడి బీసీ హాస్టల్ విద్యార్థి మృతి



సంఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బీసీ వెల్ఫేర్ డీడీ మయూరి తదితరులు









ఎల్1 కంపెనీలపై గప్‌చుప్!

- ఆరోగ్య శాఖలో రహస్యంగా టెండర్ల ఖరారు
- ప్రక్రియపై ఎమ్మెల్యేల ఫిర్యాదు.. విచారణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాసుపత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ నిర్వహణకు టెక్నికల్ కమిటీ టెండర్లను ఖరారు చేసింది. ఏయే కంపెనీలను ఎంపిక చేశారన్న విషయాన్ని మాత్రం అధికారులు బయటకు రానివ్వడం లేదు. ఎల్1 కంపెనీల పేర్లు బయట పెట్టకుండా రహస్యంగా ఉంచారు. గురువారం ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ నేతృత్వంలో కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో ఉన్న ఆసుపత్రులకు సంబంధించి మొత్తం 18 ప్యాకేజీలకు టెండర్లు ఖరారు చేశారు. అన్ని జోన్‌లకు ఎల్1 కంపెనీలను ఎంపిక చేశారు. ఇప్పటికే ఈ టెండర్ ప్రక్రియపై అనేక అనుమానాలు, ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్1 కంపెనీల పేర్లు రహస్యంగా ఉంచడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. దీనికితోడు ఏపీఎంఎస్‌ఐడీసీ టెండర్ ప్రక్రియ మొత్తాన్ని గందరగోళం చేసింది. శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ టెండర్లు మొత్తం మెడికల్ టెర్మినాలజీ, కెమికల్స్ వ్యవహారాల్లో అనుభవం ఉన్న అధికారికి అప్పగించాలి. అయితే దాదాపు రూ.1400 కోట్లు విలువైన టెండర్ల విషయంలో సాధారణ ఇంజనీర్‌కు అప్పగించారు. సదరు అధికారి తనకు నచ్చినట్లు టెండర్ నిబంధనలతో కంపెనీలకు అర్హత కల్పించారన్న విమర్శలున్నాయి. టెండర్ల ప్రక్రియపై ఉత్తరాంధ్ర, రాయలసీమ ఎమ్మెల్యేలు అనేక మంది ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

నిబంధనలు మార్పు

శానిటేషన్, సెక్యూరిటీ టెండర్లల్లో నిబంధనలను అధికారులు ఇష్టారాజ్యంగా మార్చేశారు. అధికారులు టెండర్ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన నిబంధనలకు వారే తిలోదకాలు ఇచ్చారు. తొలుత టెండర్ డాక్యుమెంట్‌లో జోన్‌ల వారీగా ఎంతమంది శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి? వారికి ఎంత జీతం ఇవ్వాలి? ఎంత మొత్తంలో కెమికల్స్ ఉపయోగించాలి? దానికి అయ్యే ఖర్చు ఎంత? అన్న వివరాలు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు పొందుపరిచారు. బిడ్ దాఖలు చేసే కంపెనీ కేవలం సర్వీస్ చార్జీ ఎంత అన్న విషయాన్ని మాత్రమే బిడ్‌లో పొందుపరచాలని స్పష్టంగా చెప్పారు. దాని ఆధారంగానే ఎల్1 కంపెనీ ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. అది కూడా సర్వీస్ చార్జీ 3.38 శాతం నుంచి 7.7 శాతం మించకూడదన్న నిబంధన పెట్టారు. చివరికి బిడ్ దాఖలు చేసే సమయంలో జోన్ల వారీగా ఎంతమంది సిబ్బందిని నియమిస్తారు? వారికి ఎంత మొత్తంలో జీతాలు చెల్లిస్తారు? ఎంత మొత్తంలో కెమికల్స్ ఉపయోగిస్తారు? అన్న వివరాలు కూడా పొందుపరచాలన్న నిబంధనలు పెట్టారు.

ఫిర్యాదులు పరిశీలిస్తాం

టెండర్ ప్రక్రియలో పాల్గొన్న ఒక కంపెనీపై కొంతమంది ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ చేస్తామి, ఆ తర్వాత టెండర్ ప్రక్రియపై ముందుకు వెళ్తామని ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు తెలిపారు.

16 రోజులు డిటెన్షన్ సెల్‌లో!

- రాత్రి నిద్రపోకుండా లైట్లు వేసి ఉంచారు... బల్లులు, పురుగులతో నిద్రలేమి
- పగటిపూట చెట్టు కింద పడుకున్నా... తెలంగాణ సీఎం రేవంత్ ఆవేదన



హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తనది కక్ష సాధించే మనస్తత్వమే అయితే మొత్తం కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉండేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కక్ష, పగ, ప్రతీకారాలకు పోతున్నారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తాము నిజంగా కక్ష సాధింపునకు పాల్పడితే తనను ఉంచిన చంచల్‌గూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనే బీఆర్ఎస్ నాయకులు ఉండేవారని అన్నారు. "డ్రోన్ ఎగరేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీనని కూడా చూడకుండా నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. కరుడు గట్టిన నేరగాళ్లను బంధించినట్లు బంధించారు. 16 రోజులపాటు కంటికి మనిషి కనిపించకుండా నక్సల్స్‌ను ఉంచే డిటెన్షన్ సెల్లో ఉంచారు. జైల్లో రాత్రంతా లైట్లు ఆన్‌లో పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా చేశారు. దీపాల వెలుగుకు బల్లులు, పురుగులు వచ్చి చేరడంతో బలవంతంగా కళ్లు మూసుకున్నా నిద్ర వచ్చేది కాదు. దాంతో పగలు చెట్టు కింద పడుకుని నిద్రపోయేవాడిని. వాళ్ల తప్పులను దేవుడే చూస్తాడని, అంతకు అంత అనుభవిస్తారని భావించి ఊరుకున్నా. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రి పాలు చేశాడు" అన్నారు. 2015లో చంచల్‌గూడ జైల్లో ఉన్నపుడు తన బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి బెయిలు కోసం ప్రయత్నిస్తుంటే ఢిల్లీ నుంచి న్యాయవాదులను పిలిపించి వాదనలు చేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. జైలు నుంచి నేరుగా వేదిక వద్దకు వెళ్లి, తిరిగి జైలుకు తీసుకొచ్చారన్నారు. రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇంత జరిగినా కక్ష సాధింపులకు పాల్పడకుండా విజ్ఞత ప్రదర్శించామని చెప్పారు. కేటీఆర్ తన ఆఫీసులో కొంత మందికి డబ్బులిచ్చి తనను, కుటుంబ సభ్యులను బూతులు తిట్టించి, రికార్డు చేయించిన వారిని చెంప పగులగొట్టే శక్తి ఉన్నా ఓపికతో ఉన్నా. కక్ష సాధింపు చర్యలు ఎవరివో తెలంగాణ సమాజం గమనిస్తోందని అన్నారు.

ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా అసైన్డ్ కమిటీలు

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసైన్డ్, మిగులు భూముల పంపిణీ వంటి అంశాలను సమీక్షించేందుకు ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు చైర్మన్లుగా ప్రభుత్వం కమిటీలను పునరుద్ధరించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా గురువారం ఉత్తర్వు(జీఓ.104) జారీ చేశారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే మంత్రులు, సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆర్డీఓ లేదా సబ్ కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయిలో భూ వ్యవహారాలను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ ఈ కమిటీ సభ్య కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, తాజాగా ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌కు అవకాశం ఇవ్వలేదు. జిల్లా స్థాయిలో ఖాళీగా ఉన్న భూములను రెవెన్యూ శాఖ సిఫారసుల మేరకు ఈ కమిటీ పరిశీలించి అర్హులైన పేద లబ్ధిదారులకు పంపిణీ చేస్తుంది. మాజీ సైనికులకు ఇచ్చే భూములనూ ఈ కమిటీనే ఖరారు చేయనుంది.

ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌కు 88 కోట్లు

బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం పరిసవారిపాలెంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటు కోసం రూ.88.08 కోట్ల మంజూరుకు ప్రభుత్వం పరిపాలన ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కేంద్రం రూ.52.85 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.35.23 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌లో ఆమోదిత నిర్మాణాలను షరతులకు లోబడి పూర్తి చేయాలని మత్స్యశాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

మాస్ లుక్‌లో...



రామ్‌చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గురువారం రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులను ఖుషీ చేశారు మేకర్స్. సినిమాకు 'పెద్ది' అనే టైటిల్‌ను ఖరారు చేసి, రామ్‌చరణ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. గుబురు గడ్డంతో చుట్ట వెలిగిస్తూ మాస్ లుక్‌లో కనిపించారు. ఈ లుక్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత రెట్టింపు చేసింది. క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

సినీ ప్రముఖుల శుభాకాంక్షలు

రామ్‌చరణ్‌కు సినీ ప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "పుట్టిన రోజు శుభాకాంక్షలు చరణ్. 'పెద్ది'లో నీ లుక్ అదిరిపోయింది. నీలోని నటుడిని ఈ సినిమా మరింత కొత్తగా చూపించనుందనే నమ్మకం ఉంది. సినీ ప్రియులకు కన్నుల పండుగగా ఉండే ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చిరంజీవి పేర్కొన్నారు. అలాగే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మహేశ్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, సాయి దుర్గాతేజ్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ కాజల్ అగర్వాల్ తదితరులు రామ్‌చరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్తూ పోస్టులు పెట్టారు.

జూన్ 2న ఇళయరాజాకు సన్మానం



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను తమిళనాడు ప్రభుత్వం జూన్ రెండో తేదీన సన్మానించనుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం శాసనసభలో ప్రకటించారు. ఇళయరాజా 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆయన పుట్టిన రోజైన జూన్ రెండో తేదీన ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు సీఎం చెప్పారు. వీసీకే సభ్యుడు చింతనై సెల్వం మాట్లాడుతూ.. 'సంగీత దర్శకుడు ఇళయరాజా తన సింఫనీ అరంగేట్రం కార్యక్రమాన్ని లండన్ వేదికగా విజయవంతంగా పూర్తి చేశారని, ఆ సింఫనీని తమిళ ప్రజలు వినేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందా? అని ప్రశ్నించారు. దీనికి సీఎం స్టాలిన్ సమాధానమిస్తూ.. 'సింఫనీ అరంగేట్రాన్ని పూర్తి చేసుకుని వచ్చిన ఇళయరాజాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సాదర స్వాగతం పలికాం. సింఫనీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో నిర్వహించాలని కోరాం. తక్షణం 4 వేల మంది కళాకారులను రాష్ట్రానికి పిలిపించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం శ్రమతో కూడుకున్నపని అని ఇళయరాజా అన్నారు' అని సీఎం తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఫలితాలు కూడా చెత్తగానే ఉంటాయి



సల్మాన్ ఖాన్

చెత్త సినిమాలు తీస్తే ఫలితాలు కూడా చెత్తగానే ఉంటాయి అంటూ.. బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'సికందర్' ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో మాట్లాడుతూ 'సరైన చిత్రాలు తెరకెక్కించలేనప్పుడు అవి బాక్సాఫీసు వద్ద పరాజయాలే మూటగట్టుకుంటాయి. అందరూ కలసి కష్టపడితేనే మంచి సినిమా వస్తుంది. అయినప్పటికీ హీరో ఫొటోను మాత్రమే పోస్టర్‌లో వేస్తారు. ప్రేక్షకులు కూడా అది చూసే థియేటర్లకు వస్తుంటారు. ఒకవేళ సినిమా ఫ్లాప్ అయితే అందరూ ఆ హీరోనే తప్పుపడతారు' అని సల్మాన్ ఖాన్ వ్యాఖ్యానించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



ఆ మాటలు నన్ను కదిలించాయి

జూనియర్ ఎన్టీఆర్

ఓ జపనీస్ అభిమాని చెప్పిన మాటలకు చలించిపోయారు జూనియర్ ఎన్టీఆర్. ఆయన కొరటాల శివ దర్శకత్వంలో నటించిన 'దేవర' చిత్రం నేడు జపాన్‌లో విడుదలవుతోంది. అక్కడ నిర్వహించిన సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో ఎన్టీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుధ పూజ పాటకు ఓ అభిమానితో కలసి స్టెప్పులేసిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. కాగా, తన జపాన్ పర్యటనపై ఆనందం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు ఎన్టీఆర్. "ఆర్ఆర్ఆర్ సినిమా చూసిన తరవాత తెలుగు నేర్చుకున్నానని ఓ జపనీస్ అభిమాని చెప్పడం నన్ను కదిలించింది. విభిన్న సంస్కృతులతోపాటు భాష నేర్చుకునేందుకు సినిమా దోహదపడుతున్నందుకు సంతోషిస్తున్నా. ఇలాంటి వాటి కోసమే భారతీయ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం' అని పేర్కొన్నారు.

సినిమాగా డొక్కా సీతమ్మ కథ



అన్నపూర్ణగా, అన్నదాతగా చరిత్రలో నిలిచిపోయిన గొప్ప మహిళ డొక్కా సీతమ్మ. ఏ సమయంలోనైనా తన ఇంటికి ఎంతమంది వచ్చినా.. లేదు.. అనకుండా వారికి తనే స్వయంగా వండి వడ్డించిన ఆ మహాతల్లి జీవిత కథ ఇప్పుడు సినిమాగా వస్తోంది. అయితే చిత్ర నిర్మాణం ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్ విషయంలో వివాదం మొదలైంది. దాని గురించి రచయిత రామకృష్ణ మాట్లాడుతూ 'సీతమ్మ కథను 'అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో మొదట నాటకం రాశాను. 2016లోనే డొక్కా సీతమ్మ సినిమా స్క్రిప్ట్‌ను తెలుగు సినీ రచయితల సంఘంలో రిజిస్టర్ చేశాను. ఎంతో కాలంగా ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి చరిత్రను పరిశోధించి స్క్రిప్ట్ తయారు చేశాను' అని చెప్పారు. చరిత్ర సాకుతో తమ రచనను కాపీ కొడుతూ వేరొక సంస్థ కూడా సినిమా తీయడానికి ప్రయత్నించడంతో ఈ వివాదం కోర్టుకు చేరిందని నిర్మాత ప్రభాకర్ గౌడ్ చెప్పారు. కాపీ రైట్ యాక్ట్ కింద తమకు హక్కు ఉన్నప్పటికీ విషయం కోర్టులో ఉన్నందువల్ల తాము కోర్టు తీర్పును శిరోధార్యంగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. అయితే వేరొక సంస్థ సినిమా తీసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అదే నిజంగా జరిగితే కోర్టు ధిక్కారం అవుతుందని ఆయన హెచ్చరించారు. కోర్టు తేల్చే వరకూ యథాతథ పరిస్థితిని కొనసాగించాలని కోరారు.



వివరాలు తెలియజేస్తున్న డాక్టర్ వివేక్, పక్కన కోలుకున్న రోగి

కిమ్స్ హాస్పిటల్స్‌లో..

క్లిష్టమైన మెదడు శస్త్రచికిత్స

గుంటూరు మెడికల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో క్లిష్టమైన పక్షవాత కేసుకు అరుదైన రీతిలో కెరోటిడ్ ఆర్టరీ స్టెంట్, ఎన్యురిజమ్ కాయిలింగ్ విధానంతో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. గురువారం కిమ్స్ హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను తెలిపారు. 76 సంవత్సరాల రోగి పక్షవాతం బారిన పడి చికిత్స పొందుతున్నా, శరీర భాగం తరచూ బలహీనతనకు గురికావడం, ఇతర ఇబ్బందులు ఏర్పడుతుండటంతో ఇటీవల కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో చేరారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి రోగిని పరీక్షించి మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే కెరోటిడ్ ధమనుల్లో కొవ్వు పేరుకుపోయినట్లు గుర్తించారు. న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌రావు నేతృత్వంలో బ్రెయిన్ యాంజియోగ్రామ్ చేయగా, మెదడు రక్తనాళం కూడా బలహీనపడి ఉబ్బి బుడగ మాదిరిగా మారినట్లు (ఎన్యురిజమ్) గుర్తించారు. డ్యూయల్ యాంటీ ప్లేట్‌లెట్‌ల థెరపీ ఉపయోగించి రోగికి చికిత్స చేయాలని నిర్ణయించారు. ఇంటర్వెన్షనల్ స్పెషలిస్ట్ డాక్టర్ వివేక్, ఏకకాలంలో కెరోటిడ్ ఆర్టరీ స్టెంట్ వేయడంతోపాటు బ్రెయిన్ ఎన్యురిజమ్‌కు కాయిలింగ్ పద్ధతిలో చికిత్స చేశారు. ఆపరేషన్ అనంతరం రోగి ఆరోగ్యపరంగా పూర్తిగా కోలుకున్నారు. సమావేశంలో ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర్ మాలెంపాటి, సీవోవో సుధాకర్ పాల్గొన్నారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు

గుంటూరు సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని అన్ని రకాల ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపును అమలు చేయనున్నట్లు వాణిజ్య అధికారి డి వెంకటేశ్వర్లు తెలిపారు. కొన్ని రకాల చేనేత వస్త్రాలపై 50 శాతం వరకు తగ్గింపు కూడా ఇస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రజలందరూ సమీపంలో ఉన్న ఆప్కో విక్రయశాలలను సందర్శించి కావలసిన వెంకటగిరి, మాధవరం, రాజమండ్రి, బందరు, చీరాల, ఉప్పాడ చీరలు, ధోవతులు, దుప్పట్లు, లుంగీలు, షర్టింగ్, టవల్స్ తదితర చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



గుంటూరు-నడికుడి మార్గంలో రైళ్ల వేగం 130 కి.మీ

● రూ. 17.31 కోట్లతో ట్రాక్ వెంట సరిహద్దు గోడ నిర్మాణం ● టెండర్ల ప్రక్రియ ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - నడికుడి - పగిడిపల్లి సెక్షన్‌లో రైళ్ల వేగాన్ని 130 కిలోమీటర్ల కంటే ఎక్కువ చేసేందుకు రైల్వే శాఖ ఉపక్రమించింది. ఇప్పటివరకు 110 కిలోమీటర్ల గరిష్ట వేగానికే పరిమితమైన ఈ సెక్షన్‌ని అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సెక్షన్‌లో ఎక్కడైతే రైలుపట్టాల పైకి ట్రెస్ పాసింగ్ జరగడానికి ఎక్కువగా అవకాశాలున్నాయో అక్కడ ట్రాక్ పొడవునా ప్రహరీగోడ నిర్మించేందుకు అన్ని అనుమతులను తీసుకొని టెండర్ల ప్రక్రియని ప్రారంభించింది. కొద్ది రోజుల్లో ఏజెన్సీలను ఖరారు చేసి రెండుగా విభజన చేసిన ఈ ప్రహరీగోడ నిర్మాణ పనులను కేటాయించనుంది. ఈ పనులు పూర్తి అయితే సెక్షన్ స్పీడ్ లిమిట్‌ని పెంచేందుకు అవకాశం ఉంటుందని రైల్వేవర్గాలు తెలిపాయి.

గుంటూరు రైల్వే డివిజన్‌లో ఏ సెక్షన్ చూసినా 130 కిలోమీటర్ల కంటే గరిష్ట వేగంతో రైళ్లు ప్రయాణించేందుకు అనుమతి లేదు. ఇందుకు కారణం డబ్లింగ్‌లు సంపూర్ణం కాక పోవడం, ఎక్కువ రద్దీ ఉండే నడికుడి మార్గంలో సింగిల్ లేన్ ఉండటమే. దీంతో ఒకదశలో వందేభారత్ లాంటి ప్రీమియం రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ వెనకడుగు వేసింది. అయితే ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులు, అధికారుల ప్రతిపాదనల మేరకు ఒకే ఒక్క వందేభారత్ (సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్) రైలుని రైల్వేబోర్డు గుంటూరు డివిజన్ మీదగా నడిపేందుకు అనుమతించింది. మరోవైపు జోన్‌లోని ఇతర డివిజన్లు అయిన విజయవాడ, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్, గుంతకల్లులో ఎక్కువ వందేభారత్‌తో పాటు ఇతర ప్రీమియం రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి.

వీటిని పరిగణనలోకి తీసుకొన్న రైల్వే అధికారులు తొలుత గుంటూరు - నడికుడి - పడిగిపల్లి సెక్షన్‌ని 130 కిలోమీటర్ల వేగానికి మించి రైళ్లు ప్రయాణించేలా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ సెక్షన్‌లో డబ్లింగ్ ప్రాజెక్టు కూడా మంజూరైంది. దీంతో గుంటూరు - నడికుడి సెక్షన్‌లో 9.84 కిలోమీటర్ల పొడవునా ప్రహరీగోడ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ. 9.77 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ పనులను ఏడాదిన్నర లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. అలానే పడిగిపల్లి - నడికుడి సెక్షన్‌లో 7.56 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్న ప్రహరీగోడకు రూ. 7.53 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ పనిని కూడా పూర్తి చేసేందుకు 18 నెలల సమయాన్ని కేటాయించింది. ఈ రెండు సెక్షన్లలో ప్రహరీగోడ నిర్మాణ పనులు పూర్తయితే రైల్వేట్రాక్‌ల పైకి ట్రెస్‌పాసింగ్‌కు అడ్డుకట్ట పడుతుంది. దాంతో గరిష్ట వేగంతో రైళ్లు నడపడానికి ఆస్కారం ఉంటుంది.

చెరువులో పడి బీసీ హాస్టల్ విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి వెంకటేశ్వర్లు, బంధువులు (ఇన్‌సెట్‌లో) కిషోర్

వట్టిచెరుకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామంలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక జడ్పీ హైస్కూల్లో 9 తరగతి చదువుతున్న బిక్కం కిషోర్(14) అనే విద్యార్థి హాస్టల్ సమీపంలోని మంచినీటి చెరువులో నీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. అదేప్రాంతంలో తోటి విద్యార్థులు ఇద్దరు స్నేహితుడిని కాపాడే ప్రయత్నంలో నీట మునిగి ప్రమాదంలో చిక్కుకున్నారు. వారిని అక్కడికి సమీపంలో ఉన్న 108 అంబులెన్స్ సిబ్బంది, గ్రామస్థులు కాపాడారు. ముందుగా నీట మునిగిన కిషోర్ జాడ కన్పించకపోవటంతో గ్రామసర్పంచ్ విజయకుమార్, ఉపసర్పంచ్ యడ్లపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, హాస్టల్ వార్డెన్, గ్రామస్థుల సహకారంతో చెరువులో వెతకగా అప్పటికే విద్యార్థి కిషోర్ మృతి చెందినట్టుగా గుర్తించి మృతదేహన్ని ఒడ్డుకు చేర్చారు. హాస్టల్ విద్యార్థి చెరువులో మునిగి మృతి చెందడంతో తోటి విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నీటిమునిగిన విద్యార్థి కిషోర్ ఐదు సంవత్సరాలుగా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్‌లోనే ఉంటూ చదువుకుంటున్నాడు. సంఘటన తెలిసిన వెంటనే సీఐ రమానాయక్, హాస్టల్ వార్డెన్ నుంచి బాలుడి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. వివరాల్లోకి వెళితే పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గంగలకుంటకు చెందిన బిక్కం వెంకటేశ్వర్లు, రాములుకు ముగ్గురు కుమారులు. మూడో కుమారుడు మృతుడు కిషోర్ ఐదు సంవత్సరాలుగా ఇదే హాస్టల్‌లో ఉంటూ జడ్పీ హైస్కూల్లో చదువుతున్నాడు. సీఐ నుంచి బాలుడి ఘటన వివరాలు తెలుసుకున్న వెంటనే తల్లి రాములు స్పృహ కోల్పోయింది. తండ్రి, బంధువులతో కలసి హుటాహుటీన వట్టిచెరుకూరు చేరుకున్నారు.

గురువారం ఉదయం హాస్టల్‌కు నీరు రాకపోవటాన్ని గుర్తించి విద్యార్థులు వార్డెన్ సాంబశివరావుకు చెప్పారు. దీంతో పంచాయతీ వారిని సంప్రదించగా ప్రస్తుతం మోటారు రిపేర్లు చేస్తున్నామని, కొద్ది సమయంలో నీరు ఇస్తామని నీరు విడుదల చేసే వ్యక్తి చెప్పాడు. నీరు అత్యవసరమని అనటంతో వార్డెన్ సాంబశివరావు చెరువు దగ్గరకు వెళ్ళి కొంచం నీరు తెచ్చుకోండని చెప్పటంతో మృతుడు కిషోర్, అతనితో పాటు మరో ఇద్దరు విద్యార్థులతో కలసి మంచి నీటి చెరువులో నీరు తెచ్చుకొనే ప్రయత్నంలో కాలు జారి కిషోర్ నీటిలోకి జారాడు. తోటి విద్యార్థులు కిషోర్‌ను కాపాడే ప్రయత్నంలో వారు కూడా నీటిలో మునిగి పోవటాన్ని సమీపంలో ఉన్న 108 సిబ్బంది పెద్దగా కేకలు వేస్తూ తోటి వారి సాయంతో ఇద్దరు విద్యార్థులను కాపాడారు. గ్రామస్థుల సహకారంతో అదే ప్రాంతంలో వెతకటం ప్రారంభించగా అప్పటికే కిషోర్ మృతి చెందటాన్ని గుర్తించి మృత దేహాన్ని ఒడ్డుకు చేర్చారు. సంఘటన తెలిసిన వెంటనే బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మయూరి, ఎంపీడీవో రవిబాబు, డీటీ దరియావలి ఆ ప్రాంతానికి చేరుకొని సంఘటనా తీరును పరిశీలించి మృతుని తండ్రిని ఓదార్చిన అనంతరం మృత దేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. మృతుడి తండ్రి విలపిస్తుండగా బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మయూరి ఆయనను ఓదారుస్తూ జరగరాని ఘోరం జరిగింది, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామంటూ స్థానిక హాస్టల్ వార్డెన్ సాంబశివరావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలంటూ ఆమె లిఖిత పూర్వకంగా సూచించారు.

విద్యార్థి దుర్మరణం బాధాకరం : మంత్రి సవిత
● వార్డెన్ సస్పెన్షన్‌కు ఆదేశం

గుంటూరు (విద్య), మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి కిషోర్ చెరువులో పడి దుర్మరణం పాలవ్వడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదవశాత్తు గురువారం ఉదయం చెరువులో పడి కిశోర్ దుర్మరణం పాలవ్వడం బాధాకరమన్నారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి సవిత తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. దుర్ఘటనకు గల కారణాలపై విచారణకు ఆదేశించామన్నారు.

విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి

హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని వార్డెన్లకు, ఇతర సిబ్బందికి మంత్రి సవిత స్పష్టం చేశారు. ప్రభుత్వంపైనా, అధికారులపైనా నమ్మకంతో తమ పిల్ల లను హాస్టళ్లలో చేర్పుతున్నారన్నారు. తల్లిదండ్రులు కంటనీరు పెట్టకుండా, గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు. వట్టిచెరుకూరు వంటి ఘటనలు జరగడం క్షమించరాని నేరమన్నారు.

రూ. 13 కోట్లతో డీసీఎంఎస్ బడ్జెట్ ఆమోదం



జేసీ భార్గవ్‌తేజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఎం హరగోపాల్

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ది గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 13 కోట్లతో బడ్జెట్ ఆమోదం లభించింది. మెడికల్ కళాశాల రోడ్డులో వున్న కార్యాలయంలో డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎ భార్గవ్‌తేజ అధ్యక్షతన గురువారం మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా జేసీ అధ్యక్షతన బడ్జెట్‌కు సంబందించిన వివరాలను, సొసైటీ ముఖ్య లక్ష్యాలను బిజినెస్ మేనేజర్ హరగోపాల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ 2025-26కు సంబంధించి రూ. 13 కోట్లతో బడ్జెట్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సభ్యులెవరూ అభ్యంతరాలు తెలియజేయకపోవటంతో బడ్జెట్‌ను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులున్నారు. అలానే జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సమావేశం పర్సన్ ఇన్‌ఛార్జ్, జేసీ ఏ భార్గవ్‌తేజ అధ్యక్షతన గురువారం బ్రాడీపేటలోని బ్యాంకు కార్యాలయంలో జరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 535 కోట్లతో బడ్జెట్ ఆమోదానికి తీర్మానం చేశారు. బ్యాంకు సీఈవో కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె బడ్జెట్‌కు సంబందించిన అంశాలను చదివి సభ్యులకు వినిపించారు. బడ్జెట్ ఆమోదం తెలపాలని సభ్యులను కోరగా ఎవరూ అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవటంతో ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 13న పరీక్ష

యడ్లపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష వాయిదా వేసినట్లు బోయపాలెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రకటన జారీచేసిందన్నారు. అయితే ఆ రోజు శ్రీరామనవమి పండుగ కావడంతో పరీక్షను వాయిదా వేసిందన్నారు. తిరిగి ఏప్రిల్ 13వ తేదీ ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించిందని, ఉదయం 5వ తరగతి ప్రవేశాలకు, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు గమనించి పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు.




రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిలకలూరిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బైపాస్ రోడ్‌లో గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామానికి చెందిన చప్పిడి రమేష్(25), అతడి చిన్నాన్న కొడుకు చప్పిడి చిన్న(19) ద్విచక్ర వాహనంపై వెళ్తూ వారి ముందు వెళుతున్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొట్టారు. దీనితో ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న చప్పిడి రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. చప్పిడి చిన్న తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 521.40 అడుగులు ఉంది. కుడికాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 16,595 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 25,123 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



పొన్నూరు పురపాలక సంఘం, పొన్నూరు

ఆర్.ఓ.సి.నెం.1755/2015/ఉ1 తేది.27.03.2025

ప్రకటన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 650 యం.ఏ. అండ్ యుడి, తేది. 27.10.1993 మాస్టర్ ప్లాన్ ప్రకారం పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో జి.బి.సి. రోడ్డును అభివృద్ధి చేయుటలో భాగంగా రూరల్ పోలీస్ స్టేషన్ నుండి కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ జరిగినది. సదరు రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయిన యజమానుదారులకు టిడిఆర్ (ట్రాన్స్‌ఫర్బుల్ డెవలప్మెంట్ రైట్స్) బాండ్లు జారీ చేయు విషయమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ డిపార్టుమెంట్ జి.ఓ.ఎం.ఎస్.నెం.4, తేది. 09.01.2025 ప్రకారం టిడిఆర్ ప్రతిపాదనలను స్క్రుటినీ కమిటీలో ఉంచడానికి ముందు పేపరు నోటిఫికేషన్ ద్వారా ఏమైనా క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలు ఉంటే 7 రోజుల్లోగా తెలియజేయమని ఆదేశాలు జారీ చేసియున్నారు. ఇందుకు సంబంధించి స్థల యజమానుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నవి.

S.No	Structure Number	Name of the Building or Site Owner	Registered Deed Number	Extent of Land Affected Sq.Mts	Door Number	Survey Number
1	L-2	Kothuri Ananda Kumar	449/2014	15.55	1-1-45/1	385-6A1B
2	L-2A	Kothuri Sathyanarayana	449/2014	10.57	1-1-45	385-6A1B
3	L-4	Majeti Srinivasa Rao	2035/1994	9.11	1-1-46	385-6A1B
4	L-6	Alapati Venkata Satya Sai Suresh	33/2020	6.65	1-1-48	385-6A1B
5	R-13	Paturi Seshamma	12/1996	80.92	24-1-54	380-5
6	R-15	Ghantasala Krishna Kumari	55/1981	24.26	24-1-51/A	380-5
7	R-73	Shaik Ilahi Bakshi	3693/2022	0.784	16-8-2	399-1
8	R-73A	Shaik Ilahi Bakshi	989/1995	6.27	16-8-1	399-1
9	R-74	Shaik Ilahi Bakshi	468/1977	5.786	16-8-1/A	399-1
10	R-76	Shaik Shafaithulla	7359/2024	2.29	16-1-19/4	399-1
11	L-71	Padavala Veera Venkata Satyanarayana	394/1998	21.09	2-1-75	385/6A1G
12	L-73	Chebrolu Srinivas	270/1968	6.42	2-1-77	385/6A1G
13	L-74	Chebrolu Veeranjaneyulu	1547/1954	2.90	2-1-78	385/6A1G
14	L-75	Khasim Md	1250/1991	14.11	2-1-78	385/6A1G
15	L-75A	Khasim Md	1251/1991	15.74	2-1-78	385/6A1G
16	L-38	Kollipara Sreerama Chandramurthy	1486/1983	3.53	2-1-34	385/6A1E
17	R-36	Yama Lakshmana Rao	1145/1980	2.98	24-1-24	380/5
18	R-53	Kollipara Surya Teja	2810/2016	2.62	23-1-24	380/5
19	L-13	Pokuri Kusuma Hara Gopal	62/2022	5.03	2-1-14	385-6A1C
20	L-8	Konduru Venkata Subbarao	323/2011	2.25	1-1-50	385-6A1B
21	L-42	Tunuguntla Umamaheswara Rao	3/2025	15.17	2-1-38	385-6A1E
22	L-41	Avvaru Bharathi Devi	1870/1966	10.31	2-1-37	385-6A1E
23	L-40	Avvaru Annapurna Devi	1870/1966	18.07	2-1-36	385-6A1E
24	L-14	Alapati Sivannarayana	210/1993	4.97	2-1-14/A	385-6A1C
25	R-2	Vemuri Srinivasa Rao, Vemuri Damodara Rao	952/2003	8.85	24-1-64	380-5
26	L-44	Chebrolu Mahalakshmi	38/1982	9.03	2-1-40	385-6A1E
27	L-47B	Allam Mary Roopa	1735/2001	2.60	2-1-45, 2-1-44/1	385-6A1E
28	L-47	Allam Venkata Srirama Murthy	2095/2002	3.94	2-1-45. 2-1-44/1	385-6A1E
29	L-47A	Allam Mary Roopa	1243/2001	2.60	2-1-45. 2-1-44/1	385-6A1E
30	L-27	Vakkalagadda Srinivasa Rao	3135/2013	7.52	2-1-25/1	385-6AID
31	R-45	Avvaru Sampath Kumar	117/2015	8.75	24-1-8	380-5
32	L-33	Karumuri Sankara Rao	281/2023. 282/2023	15.48	2-1-29	385-6A1E
33	L-59	Chunduru Ramamurthy	1243/2019	11.66	2-1-57	385-6A1E
34	L-60	Chebrolu Sri Mahalakshmi	630/1976	16.935	2-1-56	385-6A1E
35	R-49	Kurapati Venkateswara Rao	1546/1993	1.04	23-1-28	380-5
36	L-79	Garlapati Seetha Mahalakshmi	1640/2007	4.75	2-1-82	385-6A1G
37	L-80	Chebrolu Basavaiah	1154/2012	2.65	2-1-82/1	385-6A1G
38	L-77	Dogiparthy Kusumakumari	661/1957	6.32	2-1-80	385-6A1G
39	L-78	Kottagunda Venkata Naga Samba Siva Rao	109/1995	10.92	2-1-81	385-6A1G
40	L-76	Sajja Hemalatha	69/2003. 68/2003	33.69	2-1-79	385-6A1G
41	R-63	Nagasuri Mohit Bhanu Teja	2314/2015	4.27	23-1-10	380-5
42	R-60	Maturi Sivaparvathi	856/2018	3.67	23-1-13/A	380-5
43	L-26	Chimakurthi Chandra Sekhara Rao	677/2012	11.7	2-1-25	385-6A1D
44	R-64	Alapati Subbarayudu	659/1972	3.53	23-1-11	380-5
45	R-35	Devathi Lakshmi Kumari	2331/2020	3.63	24-1-25	380-5
46	R-34	P. Lakshmi Neeraja Padma	1036/2023	17.15	24-1-26	380-5
47	L-67	Kotha Surya Narayana	1928/2015	18.87	2-1-64	385-6A1F
48	R-71	Mohammad Khasim	54/2003	7.39	22-3-1/1	380-5
49	R-70	Shaik Saleem. Shaik Shamshuddin	53/2003	4.30	22-3-1/2	380-5
50	L-54	Nannapaneni Sampurna	2484/2013	8.7	2-1-52	385-6A1E
51	R-67	Alapati Adhiseshu	77/2015	4.87	23-1-2	380-5
52	R-66	Alapati Adhiseshu	55/1988	5.95	23-1-3	380-5
53	R-69	Alapati Venkata Naga Lakshmi	804/1996	0.37	23-1-2/2	380-5
54	L-30	Rachapudi Lakshmi Bhanumathi	705/1994. 687/1994	9.36	2-1-26	385-6A1D
55	R-57/A	Yama Rama Mohanrao	2053/2002	0.55	23-1-17	380-5
56	R-57	Yama Rama Mohanrao	2053/2002	1.48	23-1-19	380-5
57	R-18	P. Heramba Naga Srinivasarao	2148/2002	32.39	24-1-49	380-5
58	L-23	Sanka Naga Kameswararao	101/1987	10.73	2-1-22	385-6A1C
59	1.-21	Majeti Koti Lingam	1112/1994	16.41	2-1-20	385-6A1C
60	R-10	Rachapudi Vigneswararao	431/1983	72.83	24-1-56/A	380-5
61	R-10/A	Rachapudi Bhuvaneswari Devi	430/1983	75.48	24-1-56	380-5
62	R-7	Talluri Sarojini Devi	1274/1999	36.24	24-1-58	380-5

కావున పై తెలిపిన వారికి టిడిఆర్ బాండ్లు మంజూరు చేయు విషయములో ఏమైనా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఉన్నఎడల ఏడు (7) రోజులలోపు పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయమునకు దాఖలు చేయవలెనని తెలియజేయడమైనది.

సం/- కమీషనరు, పొన్నూరు పురపాలక సంఘం.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అజయ్ కుమార్



సత్తెనపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా గంగూరి అజయ్‌కుమార్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి గుజ్జర్లపూడి మార్కురావు గురువారం విలేకరులకు తెలిపారు. 139 ఓట్లు పోలుకాగా 85 ఓట్లు గంగూరి అజయ్ కుమార్‌కు, 52 ఓట్లు చిలకా చంద్రశేఖర్‌కు, నోటా రెండు ఓట్లు వచ్చాయని తెలిపారు. 33 ఓట్ల తేడాతో విజయకుమార్ విజయం సాధించినట్టు తెలిపారు. విజయ కుమార్ ఎన్నిక పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఆస్తి పన్ను చెల్లింపుదారులకు వడ్డీ రాయితీ

సత్తెనపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను, ఖాళీస్థలాల పన్నులకు ఏకమొత్తంగా చెల్లింపు బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం 50శాతం వడ్డీరాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. పట్టణంలోని పన్ను బకాయిలుదారులు 31వ తేదీ లోపు పన్నులు చెల్లించి వడ్డీరాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివారం రంజాన్ సెలవు రోజు కూడా పన్నులు చెల్లించవచ్చన్నారు.

31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

సత్తెనపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఈ శ్రమ డెత్ పరిహారానికి ఈనెల 31వ తేదీవరకు కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని కార్మికశాఖ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ శ్రమ గుర్తింపు కార్డు కలిగిన అసంఘటిత రంగ కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందినా పరిహారం కోసం ఈనెల 31వ తేదీ వరకు కార్మిక శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆ శాఖ పేర్కొంది.

ఉర్దూ పాఠశాలలో వాటర్ ట్యాప్స్ ధ్వంసం

నకరికల్లు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుండ్లపల్లిలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పాఠశాల గోడలు దూకి లోపలి నీటి ట్యాపులను ధ్వంసం చేశారు. ట్యాపులను అపహరించుకుపోయారు. గురువారం విద్యా కమిటీ చైర్మన్ మాబూ స్థానిక పోలీసుస్టేషన్‌లో దీనిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న ఈకేవైసీ ప్రక్రియ

సత్తెనపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో రేషన్‌కార్డులకు ఈకేవైసీ ప్రక్రియ కొనసాగుతోంది. రేషన్‌కార్డులోని ప్రతి లబ్ధిదారుడు విధిగా ఈకేవైసీ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సత్తెనపల్లి, అమరావతి, ముప్పాళ్ళ, అచ్చంపేట, నకరికల్లు, క్రోసూరు, రాజుపాలెం, పెదకూరపాడు మండలాల్లో రేషన్‌కార్డుల్లో 5,04,336 మంది సభ్యులు ఉండగా ఇంకా 45,663మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులందరినీ ఈకేవైసీ చేయటం ద్వారా వాస్తవ లబ్ధిదారులకు మాత్రమే రేషన్ పంపిణీ చేసేందుకు అవకాశం కలుగుతుంది. ఈ నేపథ్యంలో సొంత గ్రామాలకు దూరంగా ఉండే వారికి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఈకేవైసీ చేయించుకొనేలా అవకాశాన్ని కల్పించింది. ఈ నెలాఖరు లోపు గ్రామ సచివాలయాలు, రేషన్ డీలర్ల వద్దకు వెళ్ళి ఈకేవైసీ చేయించుకోవాలి.

నేడు ఇంటర్వ్యూలు

2024-25 సంవత్సరానికి ఓబీఎంఎస్ ద్వారా బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్‌ల ద్వారా రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, బ్యాంక్ ఎకౌంట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల నకళ్ళు, రుణాల కొరకు దరఖాస్తు చేసిన అప్లికేషన్ తీసుకొనిరావాలని ఎంపీడీవో తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు అభ్యర్థులకు సమాచారాన్ని చేరవేసి ఇంటర్వ్యూలకు హాజరయ్యేలాచూడాలన్నారు.

నెలాఖరు లోగా ఈకేవైసీ పూర్తిచేయాలి

నకరికల్లు, మార్చి 27(ఆంధ్రజ్యోతి):రేషన్‌కార్డులో ఉన్న సభ్యులందరూ ఈనెల 31వ తేదీలోగా ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని తహసీల్దార్ కే పల్లారావు కోరారు. గురువారం చల్లగుండ్ల జడ్పీ హైస్కూల్లో రేషన్ కార్డులో ఉన్న విద్యార్థులందరికీ ఈకేవైసీ చేయించారు. అన్ని గ్రామాల్లోని రేషన్‌డీలర్లు, కార్డులో ఉన్న విద్యార్థులందరితో ఈకేవైసీ చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

సత్తెనపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళిపాళ్ళ భాగ్యనగర్ కాలనీకి చెందిన ఊటుకూరి లలిత గురువారం మరణించారు. సమాచారం తెలుసుకున్న జనసేన మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు, చిలక పూర్ణలు ఆమె మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు పంపిన రూ 5వేల ఆర్థికసాయాన్ని అందించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

మాచర్లటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి

రెంటచింతల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి పథకం కూలీలకు వడదెబ్బ తగలకుండా ప్రథమ చికిత్స కిట్లు గురువారం ఎంపీడీవో కె సరోజినిదేవి అందజేశారు. ప్రతి కూలీకి నీడ, నీరు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, ఏపీవో జయచంద్ర, ఎఫ్ఏ సామ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

రెంటచింతల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అవివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. రెంటచింతలలోని రేగులమాన్యంలో గురువారం ఈ ఘటన జరిగింది.

సొసైటీలో డిజిటల్ సేవలు

పెదకూరపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1వ తేదీనుంచి పరసతాళ్ళూరు డీసీఎంఎస్‌లో పూర్తిస్థాయి డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తాయని పెదకూరపాడు జీడీసీసీబీ మేనేజర్ రవికుమార్ అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు వ్యవసాయ సహకార సంఘ ప్రాంగణంలో గురువారం డిజిటల్ సేవలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మోదుగుల శ్రీనివాసరావు, పరస తాళ్ళూరు సహకార సంఘం కార్యదర్శి మానుకొండ శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కారంపూడి ఉప ఎంపీపీ ఎన్నిక వాయిదా



ఉప ఎంపీపీ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు వెల్లడిస్తున్న అధికారులు

కారంపూడి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉత్కంఠ రేపిన కారంపూడి మండల పరిషత్ ఉపఎంపీపీ ఎన్నిక కోరం లేకపోవడంతో ఎన్నికల అధికారి డీఈ లింగమూర్తి, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి శుక్రవారానికి వాయిదా వేశారు. ఈనెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు ఎంపీటీసీలు అందరూ హాజరుకావాలని సూచించారు. కారంపూడిలో టెన్షన్ రేపిన ఈ ఎన్నిక సమయానికి ఎంపీటీసీలు హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. వైసీపీకి చెందిన 11మంది ఎంపీటీసీ మెంబర్లు తమకు రక్షణ కల్పించి ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలని హైకోర్టులో లంచ్ మోషన్ పిటీషన్ కూడా దాఖలు చేశారు. హైకోర్టు పోలీసులకు డైరెక్షన్ కూడా ఇచ్చిం ది. వైసీపీ ఎంపీటీసీలకు పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తూ ప్రత్యేక వాహనాల్లో ఎన్నికలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించింది. అయినా వైసీపీ కౌన్సిలర్లు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఎన్నికల ప్రక్రియకు హాజరుకాలేదు.

లోపాయికారి ఒప్పందం

మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ మెంబర్లు ఉండగా అందులో మొత్తం ఏకగ్రీవమయ్యాయి. ఇందులో ముగ్గురు టీడీపీ తీర్థం పుచ్చుకోగా మిగిలిన 11 మంది వైసీపీ ఎంపీటీసీ మెంబర్లు ఉపఎంపీపీ ఎన్నికల ప్రక్రియలో పాల్గొని మెజార్టీతో ఉపఎంపీపీ పదవిని కైవసం చేసుకోవాలని భావించారు. తదుపరి మిరియాలకు చెందిన ఎంపీటీసీని ఎంపీపీగా ఎన్నుకోవాలని చూసి ఎంపీటీసీలు జారిపోకుండా కట్టడి కూడా చేసుకున్నారు. బుధవారం రాత్రి వైసీపీ ఎంపీటీసీ మెంబర్లు అధికారపార్టీ నాయకులతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్టుగా సమాచారం. అందర్నీ మీ పార్టీలోకి చేర్చుకోండి.. కానీ మాఅందరికీ గిట్టని వ్యక్తిని ఎంపీపీని చేయడానికి వీల్లేదని డిమాండ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో అధికార పార్టీ శ్రేణులు డైలమాలో పడ్డాయి. గురువారం జరగాల్సిన ఉపఎంపీపీ ఎన్నిక శుక్రవారానికి వాయిదా పడేలా చేశారని వినికిడి.

సీఎం సహాయనిధి పేదల పాలిట సంజీవని

● ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

వెల్దుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలపాలిట సంజీవని అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాచర్ల నియోజకవర్గంలోని 49 మంది లబ్ధిదారులకు రూ.48.80 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. నిరుపేదలు వైద్యఖర్చులకు ఈ నగదును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. వెల్దుర్తిలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన టీడీపీ జెండా దిమ్మె ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 29వ తేదీన వెల్దుర్తిలో జెండా దిమ్మెల నిర్మాణానికి ఏర్పాట్లుచేస్తున్నారు.

రెంటచింతల మండలానికి రూ.7.55 లక్షలు

రెంటచింతల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.7,55,590 నగదు చెక్కులను అందజేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

పాడిపంటలతో చల్లగా ఉండాలి

రానున్న రోజుల్లో ప్రతి గ్రామం పాడిపంటలు, అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి ఆకాంక్షించారు. పల్నాడు అర్చకసేవా సంఘం అధ్యక్షుడు చంగోల శేషాచారి నేతృత్వంలో వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు బ్రాహ్మణులు, వేదపండితులు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనాలు అందించారు. అలాగే ఉగాది పండుగ పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

మాచర్లటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. గురువా రం మండలంలోని అలుగురాజుపల్లి న్యూటన్స్ గ్రూపు ఆఫ్ ఇనిస్టిట్యూష న్స్‌లో నిర్వహించిన 24వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. మంచి క్రమశిక్షణ, నడవడికతో యువత ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. న్యూటన్స్ కళాశాల కార్యదర్శి జున్నా శ్రీనివాసరెడ్డి, టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి ప్రసంగించారు.

తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలన

పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న యాగశాలను, వాహనశాలను పరిశీలించారు. అలాగే కల్యాణమండపం, వీరభద్రస్వామి ఆలయం, స్వామివారి రథం పరిశీలించారు. రథోత్సవానికి మాడవీధుల్లో అడ్డంకులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ముస్లింల సామాజిక భద్రత చంద్రబాబుతోనే సాధ్యం

కారంపూడి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ముస్లింల సామాజికభద్రత సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని వినుకొండ రోడ్డులో మర్కస్‌మసీదులో ముస్లిం పెద్దలు తండా మస్తాన్‌జానీ ఆధ్వర్యాన నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు.

నాలుగు గ్రామాలలో ఉపసర్పంచ్ ఏకగ్రీవం

● మరో 3 గ్రామాల్లో వాయిదా

పిడుగురాళ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మండలంలోని మూడు గ్రామ పంచాయతీలకు ఉపసర్పంచ్ ఎన్నిక లు గురువారం జరిగాయి. కోనంకి ఉపసర్పంచ్‌గా ఇర్ల సాంబయ్య, కామేపల్లి ఉపసర్పంచ్‌గా రొండి మంగమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. న్యూవెల్లంపల్లిలో ఉపసర్పంచ్ ఎన్నికకు కోరంలేక శుక్రవారానికి వాయిదావేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వ సంక్షేమపథకాలు నచ్చి టీడీపీలో చేరినట్లు కోనంకి ఉపసర్పంచ్ సాంబయ్య తెలిపారు. వార్డుసభ్యులు బాణావత్ దుర్గానాయక్, ఎల్ రాణి, పులిచర్ల ఆదిలక్ష్మీతోపాటు 26 కుటుంబాలు గురువారం పట్టణ కార్యాలయంలో టీడీపీలో చేరాయి.

కేసానుపల్లి ఉపసర్పంచ్‌గా వెంకమ్మ..

దాచేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కేసానుపల్లి గ్రామ ఉప సర్పంచ్‌గా గ్రామానికి చెందిన 6వ వార్డు సభ్యులు చిట్టిపోగు వెంకమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం గ్రామ సచివాలయంలో చిట్టిపోగు వెంకమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా దాచేపల్లి ఈవోపీఆర్‌డీ బీఎల్ఎన్ గుప్తా, పంచాయతీ కార్యదర్శి స్వామినాయక్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. దాచేపల్లి ఎస్ఐ సౌదర్‌రాజన్ బందోబస్తు నిర్వహించారు.

వేమవరం ఉపసర్పంచ్ టీడీపీ కైవసం

మాచవరం, పిన్నెల్లి ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా

మాచవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం ఉపసర్పంచ్ పదవిని టీడీపీ కైవసం చేసుకుంది. మండలంలో వేమవరం, మాచవరం, పిన్నెల్లి గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించారు. మాచవరం పిన్నెల్లి గ్రామాల్లో కోరంలేక ఎన్నిక వాయిదాపడింది. వేమవరంలో ఇప్పాల కోటేశ్వరమ్మను ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి నాగేశ్వరరావు కోటేశ్వరమ్మకు ఎన్నికైనట్టు ధ్రువపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



కోనంకి ఉపసర్పంచ్‌గా ఇర్ల సాంబయ్యకు ఎన్నికల ధ్రువపత్రం అందజేస్తున్న అధికారి శ్రీనివాసరెడ్డి

కారంపూడి మండలంలో 8 ఉపసర్పంచ్ పదవులు టీడీపీ కైవసం

కారంపూడి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కారంపూడి మండలంలో 8 గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌ల ఎన్నిక గురువారం నిర్వహించారు. 8 గ్రామాల్లోనూ ఉపసర్పంచ్‌ల పదవులు టీడీపీ కైవసం చేసుకుంది. అన్ని చోట్లా మహిళలే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కారంపూడిలో బాణావత్ సరస్వతిబాయి, పేటసన్నిగండ్లలో తోడేటి రాజేశ్వరి, ఇనుపరాజుపల్లిలో రత్నమేరి, నరమాలపాడులో షేక్ ఆసిమా, చింతపల్లిలో ఉన్నం మాధవి, ఒప్పిచర్లలో గంగనపల్లి పుష్పలత, చినగార్లపాడులో జిడుగు సుమతి, కాచవరం ఉపసర్పంచ్‌గా కొత్తపల్లి లక్ష్మమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు ఉపసర్పంచ్‌లుకు ధ్రువీకరణ పత్రాలు అందించారు.

మాచర్ల మండలంలో..

మాచర్ల రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం, అమ్మానీ జమ్మలమడక గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌ల ఎన్నిక గురువారం నిర్వహించారు. రెండుచోట్లా టీడీపీకి చెందిన మహిళలే ఉప సర్పంచ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాయవరం ఉపసర్పంచ్‌గా పెండ్లి వెంకటకుమారి, అమ్మానిజమ్మలమడక ఉపసర్పంచ్‌గా దొడ్డా వెంక్రటావమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బోదలవీడు ఉప సర్పంచ్‌గా శ్రీనివాసరావు

వెల్దుర్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదలవీడు ఉపసర్పంచ్‌గా ధర్మవరపు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికను అధికారులు గురువారం నిర్వహించారు. పోటీలో ఎవరూ లేకపోవడంతో ధర్మవరపు శ్రీనివాసరావును ఏకగ్రీంగా ఎన్నిక చేస్తూ అధికారులు ధ్రువీకరణ పత్రం అందించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత నేత మండలపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముటుకూరు ఉపసర్పంచ్‌గా చెన్నయ్య

దుర్గి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరు, ధర్మవరం గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ధర్మవరం గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక కోరం లేక శుక్రవారానికి వాయిదా వేసినట్లు స్పెషలాఫీసర్ హనుమంతరావు తెలిపారు. ముటుకూరు ఉపసర్పంచ్‌గా దొండపాటి చెన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

టీడీపీలో చేరిన ఒప్పిచర్ల ఎంపీటీసీ

కారంపూడి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లకు చెందిన వైసీపీ ఎంపీటీసీ పిన్నెల్లి అనంతరామయ్య ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీలో చేరినవారిలో పిన్నెల్లి నరసింహారావు, మల్లికార్జునరావు, దేవరగట్టు వెంకటనరసయ్య, పిన్నెల్లి శ్రీను, ఇరుకులపాటి అర్జునరావు తదితరులు ఉన్నారు.



శ్రీనివాస థియేటర్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

థియేటర్లలో ఆర్డీవో తనిఖీ

మాచర్ల రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాస థియేటర్, రామాటాకీస్ థియేటర్లను గురువారం గురజాల ఆర్డీవో మురళీకృష్ణ పరిశీలిచారు. థియేటర్ల లైసెన్సు రెన్యూవల్, ల్యాండ్ కన్వర్షన్, నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు వంటివి పరిశీలించారు. ఆర్డీవో మురళీకృష్ణ వెంట మాచర్ల తహసీల్దార్ బండెల కిరణ్‌కుమార్, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

క్రెడిట్ క్యాంప్‌కు 398మంది హాజరు

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన క్రెడిట్‌క్యాంప్‌లో 398మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంపీడీవో శివపార్వతి తెలిపారు.బ్యాంక్‌లలో కార్పొరేషన్ రుణాలు పొందేందుకు బీసీ, రెడ్డి, కమ్మ, కాపువర్గాలకు చెందిన 524మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలలో వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు, గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రోసూరులో 190 మంది..

క్రోసూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన 190మంది హాజరయ్యారు. క్రెడిట్ క్యాంపులో ఎంపికైనవారి జాబితాను త్వరలో ప్రకటించనున్నట్టు ఎంపీడీవో జీ శ్రీనివాసరావు తెలిపారు.

వ్యర్థాలను తొలగించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బెల్లంకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ సచివాలయానికి వెళ్లే రహదారి పక్కనే వ్యర్థాలు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన మండలస్థాయి అధికారులు పారిశుధ్య కార్మికులతో గురువారం వ్యర్థాలను తొలగించారు. ఎంపీడీవో హనిమిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ గిరిరెడ్డి స్పందించి వ్యర్థాలను తొలగించారు. అంతేగాక బెల్లంకొండ సెంటర్‌లోని చికెన్ దుకాణ యజమానులకు నోటీసులు జారీచేశారు. ఇక నుంచి రోడ్డుపక్కన వ్యర్థాలు వేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో వేలం ఆదాయం రూ.9,48,500

బెల్లంకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న కోళ్ళూరు ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వేలం ఆదాయం రూ.9,48,500 వచ్చినట్టు దేవదాయ శాఖ ఈవో ఏ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆలయం వద్ద వేలం నిర్వహించినట్టు తెలిపారు. కొబ్బరికాయలు, పూజాద్రవ్యాల వేలంలో రూ.5.64లక్షలు, బొమ్మలు అమ్ముకొనేందుకు రూ.2,01,500, క్యాంటీన్, కూల్‌డ్రింక్స్ విక్రయించేందుకు రూ.1.03లక్షలు, తలనీలాలు పోగుచేసుకొనేందుకు రూ.80వేల ఆదాయం వచ్చిందని ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి, జూనియర్ అసిస్టెంట్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈనెల 31 లోపు ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. రెవెన్యూ అధికారులే డీలర్లను పాఠశాలలకు పంపి విద్యార్థులకు ఈకేవైసీ చేయిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో 6 రోజుల పండుగ

క్రోసూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని భారీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ 16 రోజుల పండుగ గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పాస్టర్లకు రక్షణ కల్పించాలి

పిడుగురాళ్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్‌ను హత్యచేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని క్రైస్తవులు, క్రైస్తవ సంఘాలు ఆరోపించాయి. పిడుగురాళ్ల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బాచిపోగు సాగర్‌బాబు అధ్యక్షతన గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మారాజు డేవిడ్‌రాజు, వాసా నవయ్య, కొమ్ము విజయ్‌కుమార్, పి రాజు, డేగల అబ్రహం, ఆనంద్, అజయ్‌కుమార్, జయరాజు, అంబేద్కర్, నాగేశ్వరరావు, ప్రసాద్, నాజర్, బాజి, మరియదాసు, సురేష్, పట్రా సుధాకర్, ఇజ్రాయేలు, డేవిడ్, కోటేశ్వరరావు, ఇమ్రాన్, కోట స్వామి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

చర్చి పాస్టర్స్ అసోసియేషన్ ఆందోళన

మాచర్లటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్‌ను హత్య చేసి యాక్సిడెంట్‌గా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ మాచర్ల పట్టణ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు పాల్, రవికుమార్, యాకోబు, ప్రభుదాసు, మేరిబాబు, విద్యాసాగర్, యోహాన్, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి వద్ద యాక్సిడెంట్‌లో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మరణంపై అనుమానాలు ఉన్నాయని ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని అమరావతి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ప్రభుదాసు కోరారు. గురువారం ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రవీణ్ మృతికి సంతాపం తెలిపారు. సమావేశంలో మండలంలోని పలువురు పాస్టర్స్ పాల్గొన్నారు.



ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

ఉపవాస దీక్షలు పాటించటం గొప్ప విషయం

ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ముస్లింలు రంజాన్‌మాసంలో కఠినమైన ఉపవాసదీక్షలు పాటించటం గొప్ప విషయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో ముస్లిం యూత్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సోదరులకు ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. 1200మందికి ఆయన రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, సయ్యద్ పెద కరిముల్లా, నూర్ బాషా జానీబాబు, మస్తాన్‌వలి, రాంబో బుడే, దరువూరి నాగేశ్వరరావు, దూత్‌కే, గౌస్, వడ్డవల్లి వలి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాచర్ల రోడ్డులో ఉన్న ఈద్గా స్థలాన్ని పరిశీలించారు.

● పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో టీడీపీ నేత ఎంఎస్ గృహం వద్ద రంజాన్ తోఫా పంపిణీ జరిగింది. పేద ముస్లింలకు రంజాన్ సరుకులను ఎమ్మెల్యే కన్నా అందించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో కన్నా పాల్గొన్నారు. ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర నేత ఎలినేడి రామస్వామి, పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంకొండ ఉపసర్పంచ్‌గా రజాక్

బెల్లంకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ ఉపసర్పంచ్‌గా కొండవీటి షేక్ రజాక్(చిట్టి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం వార్డు మెంబర్లు రజాక్‌ను బెల్లంకొండ ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బెల్లంకొండ పంచాయతీసెక్రటరీ గిరిరెడ్డి, రజాక్‌కు డిక్లరేషన్‌ను అందజేశారు. వెంకటాయపాలెం ఉపసర్పంచ్‌గా వార్డుమెంబర్లు భూక్యానాగమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నెమలికల్లు ఉప సర్పంచ్ షేక్ కరిముల్లా

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమలికల్లు పంచాయతీ ఉపసర్పంచ్‌గా టీడీపీ బలపర్చిన షేక్ కరిముల్లా గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదిమంది సభ్యులకు గాను 8మంది ఎన్నికలో పాల్గొనగా ఏడుగురు సభ్యులు కరిముల్లాకు మద్దతు తెలిపారు. దీంతో ఎన్నికల అధికారి ఈఓఆర్‌డీ పద్మజ, కరిముల్లాను ఉపసర్పంచ్‌గా ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవం

ముప్పాళ్ళ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదల, రుద్రవరం గ్రామాల పంచాయతీలకు గురువారం జరిగిన ఉపసర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మాదల ఉపసర్పంచ్‌గా తిరుమలశెట్టి సైదుబాబు ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. సైదుబాబును ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తన కార్యాలయంలో అభినందించారు. రుద్రవరం ఉప సర్పంచ్‌గా రెండోవార్డు సభ్యుడు పులిచర్ల అప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఎన్నికలు

రాజుపాలెం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు గ్రామాలలో గురువారం నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కొత్తబోధనం గ్రామ ఉపసర్పంచ్‌గా తోట శ్రీనివాసరావు, అంచులవారిపాలెం ఉపసర్పంచ్‌గా డబ్బూరి అయెరయ్య, ఉప్పలపాడు ఉపసర్పంచ్‌గా రామావత్ మంగ్లీబాయ్, రాజుపాలెం ఉపసర్పంచ్‌గా మొర్రిబోయిన రమాదేవి, కుబాద్‌పురం గ్రామ ఉపసర్పంచ్‌గా అంచుల సీతారావమ్మలు ఎన్నికైనట్లు ఎంపీడీవో సత్యానారాయణ తెలిపారు. ఆయా గ్రామాలలో ఎన్నికల అధికారులుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ నరసింహారావు, ఏవో వెంకటనరసయ్య, మండల పరిషత్ అధికారులు షేక్ జానీబాషా, ముక్కంటి, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

ముమ్మరంగా ఈకేవైసీ నమోదు

మాచవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ కార్డులకు సంబంధించి ఈకేవైసీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల డీలర్లు, వీఆర్‌వోలు ముమ్మరంగా చేపడుతున్నారు. గురువారం వేమవరం వీఆర్‌వో అఖిల్ పాఠశాలలకు వెళ్ళి విద్యార్థులచే ఈకేవైసీ చేయించారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు తల్లికి వందనం రావాలంటే తప్పనిసరిగా రేషన్‌కార్డులో పేరు ఉంటేనే వర్తిస్తుంది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు కూడా అధికారులకు సహకరించి ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

క్రెడిట్ క్యాంపు

పిడుగురాళ్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వం కేటాయించిన బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ రుణ అర్హత మేళాను గురువారం గాంధీనగర్ సచివాలయం వద్ద నిర్వహించారు. సుమారు 270మంది హాజరుకాగా వివిధ బ్యాంక్‌ల సిబ్బంది, సెలక్షన్ కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ శ్రీధర్‌లు హాజరయ్యారు.

సచివాలయ ఉద్యోగి నిర్బంధం

పిడుగురాళ్ల పట్టణ 3వ వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ వెంకట్‌తో దాసరి చందు అనే యువకుడు అసభ్యంగా మాట్లాడటమే కాకుండా వెంకట్ చేతిలోని ఫోన్‌ను నేలకేసి కొట్టి సచివాలయంలో కూర్చోపెట్టి తాళం వేసిన ఘటన గురువారం జరిగింది. దాసరి చందు కొన్ని ధ్రువపత్రాల కోసం సచివాలయానికి వచ్చి ప్లానింగ్ సెక్రటరీ వెంకట్‌పై దురుసుగా ప్రవర్తించాడు. సచివాలయ ఉద్యోగులు ఈ విషయా న్ని పోలీసులకు, కమిషనర్ శ్రీధర్‌ను కలిసి వివరించారు.

కేసానుపల్లిలో ముస్లింలకు ఇఫ్తార్

దాచేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసానుపల్లి గ్రామంలో రంజాన్ సందర్భంగా ముస్లింలు నమాజ్ చేశారు. గురువారం గ్రామంలోని మసీదులో రంజాన్‌తో ఉపవాసదీక్షల్లో ఉన్న ముస్లింలకు టీడీపీ నాయకుడు షేక్ జానయ్య ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోసం ప్రత్యేక దువా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరి రామకోటయ్య, కోట శాయన్న, పూర్ణమ్మ, కోటయ్య, నెల్లూరి హనుమంతరావు, బొల్లా కిట్టారావు, తోట నాగేశ్వరరావు, మెగా మహేష్, అరటికాయల నాగుల, షేక్ హసానయ్య, షేక్ నాగుల, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో రుణమేళా

వెల్దుర్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. మొత్తం 260 మంది దరఖాస్తు చేసుకోగా 215 మంది మేళాకు హాజరయ్యారు. ఈ మేళాలో వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గిలో నేడు...

దుర్గి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం క్రెడిట్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివప్రసాద్ గురువారం తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు అప్లికేషన్, ఆధార్, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరన పత్రం జిరాక్స్‌లు మూడు సెట్లతో క్రెడిట్ క్యాంపునకు హాజరుకావాలన్నారు.

నివేశన స్థలాలకు పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గృహాలులేని నిరుపేదలు తమకు ఇళ్లు మంజూరుచేయాలని మండలంలో 725మంది దరఖాస్తు చేసుకోగా వాటిని విచారణ జరిపి భూహక్కుపత్రాలు లేనివారికి పొజిషన్ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నట్లు తహసీల్దార్ డానియేలు తెలిపారు. దరఖాస్తుదారుల్లో విచారణ జరపగా 240మందికి హక్కుపత్రాలు లేకపోవడంతో పొజిషన్ పత్రాలను మంజూరుచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 43మందికి మంజూరుచేశామన్నారు. మిగిలినవారికి కూడా పత్రాలు అందజేస్తామన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

'31లోపు 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి'

రొంపిచర్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలోని పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాయటానికి దరఖాస్తు తేదీ ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందని ప్రిన్సిపాల్ రవినాయక్ గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 20వ తేదీన పాఠశాల ఆవరణలో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందన్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ నిబంధనలు అనుసరించి విద్యార్థులను ఎంపికచేయటం జరుగుతుందన్నారు. వివరాలకు సెల్.9701030357 నెంబరును సంప్రదించాలని కోరారు.

బీఎల్వోపై చర్యలు

శావల్యాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం అధికారులు అప్పగించిన విధుల్లో అలసత్వం వహించిన శావల్యాపురంలోని 122వ పోలింగ్ బూత్ బీఎల్వో గౌసియాపై వినుకొండ నియోజకవర్గ ఎన్నికల అధికారి కందుల శ్రీరాములు ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనునట్లు తహసీల్దార్ సుజాత గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో అధికారుల ఆదేశాలకు స్పందించకపోవడంతో బీఎల్వోకి నోటీసులు జారీచేసినా స్పందించకపోవడంతో చర్యలకు ఆదేశించినట్లు తెలిపారు.

అయోమయంగా ఈకేవైసీ

ఈపూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈకేవైసీపై పరిస్థితి అయోమయంగా మారింది. రేషన్ కార్డుల లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. అయితే ఈకేవైసీ చేయాల్సిన వారిపేర్లతో జాబితా విడుదల చేశారు. కాని రేషన్ డీలర్లు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈకేవైసీ చేయాలంటున్నారు. దీంతో బతుకుతెరువు కోసం వేరే ప్రాంతాలకు వెళ్ళిన వారిని పిలిపిస్తున్నారు. తీరా వాళ్ళు ఇక్కడికి వచ్చిన తరువాత జాబితాలో వారి పేరు లేకపోవడంతో వెనక్కు పంపుతున్నారు. ముందుగా ఈకేవైసీ ఎవరికి చేయాలనే అవగాహన లేకపోవడం వలనే ప్రజలు అయోమయం గందరగోళం నెలకొంటోంది.

నిరుపేద కళాకారులకు రూ.5లక్షలకు బీమా

వినుకొండ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరుపేద కళాకారులకు గుమ్మడి కళాపీఠం సౌజన్యంతో యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించనున్నట్లు కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలో గురువారం కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద కళాకారుల కుటుంబాలను ఆదుకునే లక్ష్యంతో రూ.5లక్షలు విలువ చేసే ఇన్సూరెన్స్‌ను చెల్లించనున్నట్లు తెలిపారు. దీనిపై కళాకారులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కళాకారులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలని వినతి

ఈపూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని మండలంలోని కళాకారులు గురువారం ర్యాలీగా వెళ్ళి తహసీల్దారు ఎ.నళినికి వినతి పత్రం అందజేశారు. కళాకారులు కడుదుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారని, కళాకారులకు ఇళ్లస్థలాలు ఇచ్చి గృహాలను నిర్మించాలన్నారు. కనుమరుగు అవుతున్న కళలను ఆదిరించాలన్నారు. కార్యక్రమంలో గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపకులు గుమ్మడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి హనుమంతురావు, లింగిశెట్టి పూర్ణచంద్రరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రుణమేళా

వినుకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగంగా బీసీ, ఈబీసీ, కాపు లబ్ధిదారులకు రుణ అర్హత మేళా ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పుట్టారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే రుణమేళాకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

వైసీపీ నాయకుడి ఆక్రమణలపై చర్యలు తీసుకోండి: అంకారావు

ఈపూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసుళ్ళపల్లి, కొచ్చెర్ల రెవెన్యూ గ్రామాలలో ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన మండల ఉపాధ్యక్షుడు నిశ్శంకరరావు అంకారావు డిమాండ్ చేశారు. గురువారం అంకారావు మాట్లాడుచూ వైసీపీ ప్రభుత్వం హయాంలో మండల వైసీపీ నాయకుడు తన బంధువుల పేర్లతో వందల ఎకరాలు ప్రభుత్వ భూములను ఆక్రమించి విక్రయించాడని ఆరోపించారు. కొచ్చెర్లలో ఖాతా నెంబరు 2663లో సర్వే నంబర్లు 710-ఏ-1,713-2లలో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసినట్లు పట్టాదారు పాసుపుస్తకాలు పుట్టించారన్నారు. అదేవిధంగా 743-5లో 5.89 ఎకరాలు భూమి ఆక్రమించి పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకొని వేరేవాళ్ళకు విక్రయించాడన్నారు. దీనిపై జిల్లా అధికారులకు, ఈపూరు తహసీల్దారుకు పిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై తహసీల్దారు ఏ నళిని మాట్లాడుతూ పిర్యాదును పరిశీలించి సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చామన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించామన్నారు.

పీ4 సర్వేపై సమీక్ష

వినుకొండ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ, పట్టణాల్లో పీ4 సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేను తప్పనిసరిగా చేపట్టాలని తహసీల్దార్ సురేష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, సచివాలయ సర్వే సిబ్బందితో గురువారం పీ 4 సర్వే, రీసర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం, రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పీ4 సర్వేను చేపట్టాలని ఆదేశించారు. రీసర్వేతో పాటు రెవెన్యూ సేవలపై పలు సూచన చేశారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, సమస్య తీవ్రతను బట్టి తక్షణ పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పేదల కాలనీకి అడ్డుగోడ


వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహరీ



జగ్జీవన్‌రామ్ కాలనీ ప్రహరీ వెంబడి నిలిచిపోయిన మురుగు నీరు

- స్టేడియం పేరుతో వైసీపీ ప్రభుత్వ నిర్మాణం
- పెరిగిన రెండు కిలోమీటర్ల దూరం
- పనులకు వెళ్లాలంటే నిత్యం ఇబ్బందులే
- ఇళ్ల ముందుకు చేరుతున్న మురుగునీరు
- తొలగించాలని జగ్జీవన్‌రామ్ కాలనీ వాసుల వేడుకోలు

వినుకొండ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో ఒంటెద్దుపోకడలు పోయిందనేందుకు పేదల కాలనీకి వెళ్లే ప్రధాన రహదారికి అడ్డంగా ప్రహరీ నిర్మించడమే ఇందుకు నిదర్శనం. పట్టణంలోని జగజ్జీవన్‌రామ్ కాలనీ వాసులకు గత ఐదేళ్లుగా ప్రధాన రహదారికి అడ్డంగా గోడ నిర్మించడంతో ఆ కాలనీవాసులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. డిగ్రీ కాలేజీ సమీపంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన వెంచర్లకు వెళ్లే ప్రధాన బాటకు స్టేడియం పేరుతో అడ్డుగోడ నిర్మించడంతో స్థానికులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. గోడ నిర్మించడంతో 100 మీటర్లలో ఉన్న ప్రధాన రహదారికి చేరుకునేందుకు వీరంతా అంబేడ్కర్ కాలనీ నుంచి తిరిగి ఏనుగుపాలెం గేటు, ముండ్లమూరు డౌన్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా రైలుపేట నుంచి ఏనుగుపాలెం గేటు, అంబేడ్కర్ కాలనీ మీదుగా వర్షపునీటితో పాటు మురుగునీరు జగ్జీవన్‌రామ్ కాలనీ మీదుగా ముట్లకుంట కాలనీకి చేరాల్సిన మురుగునీరు గోడ నిర్మించిన ప్రాంతంలో నిల్వ ఉండటంతో ఆ ప్రాంత వాసులు దోమలు, వాసనతో అల్లాడిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బ్రహ్మనాయుడు ఆ ప్రాంతంలోని వెంచర్ల అభివృద్ధిని అడ్డుకునేందుకు గోడ నిర్మించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారికి స్టేడియం పేరుతో నిర్మించిన ప్రహరీ గోడను తొలగించి నివాస ప్రాంతాలకు వంద మీటర్ల దూరంలోని నూజెండ్ల ప్రధాన రహదారి వైపు రాకపోకలకు రోడ్డు ఏర్పాటుచేసి మురుగు నీరు ప్రవహించేలా డ్రెయినేజీ నిర్మించాలని జగ్జీవన్‌రామ్ కాలనీవాసులు కోరుతున్నారు. చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రధానరహదారికి అడ్డుగా నిర్మించిన గోడను తొలగించి రాకపోకలకు వీలు కల్పించాలని వేడుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జగ్జీవన్‌రామ్ కాలనీ ఏర్పడింది. గతంలో మౌలిక వసతుల కోసం పలు మార్లు అధికారులను కోరాం. వసతులు కల్పించక పోగా ఉన్న రోడ్డును మూసి వేయడంతో రెండు కిలోమీటర్లు మేర నడిచి సెంటర్‌కు వెళ్లాల్సి రావటంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం.


రిక్షా కూలీ మేడబోయిన కోటేశ్వరరావు

రెండు కిలోమీటర్ల దూరం పెరిగింది: కొత్త కుమారి

వంద మీటర్లు నడిస్తే రోడ్డుకు చేరుకుంటాం. అయితే అడ్డుగోడ నిర్మించడం కారణంగా అంబేడ్కర్ కాలనీలో నుంచి ఏనుగుపాలెం రోడ్డులోని గేటు, ముండ్లమూరు డౌన్ మీదుగా 2 కిలోమీటర్లు నడిచి చెక్‌పోస్టు సెంటర్‌కు చేరుకోవాల్సి వస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నూతన రోడ్డు ఏర్పాటు చేస్తారని ఆశగా ఎదురు చూశాం. తీరా రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించడంతో ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా జగ్జీవన్‌రామ్ కాలనీకి రోడ్డును పునరుద్ధరించాలి.



అసంపూర్తి ఇళ్ల నిర్మాణంపై దృష్టిపెట్టండి

● గృహ నిర్మాణ శాఖ సమీక్షలో ప్రత్తిపాటి


గృహనిర్మాణశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గత 10 సంవత్సరాలలో నియోజకవర్గం పరిధిలో మంజూరైన ఇళ్లు, మధ్యలో నిలిచిపోయిన ఇళ్లపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టాలని, అసంపూర్తి ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి, కూటమిప్రభుత్వ నిర్ణయాలు వివరించి ఇళ్ల నిర్మాణం జరిగేలా చూడాలని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం సూచించారు. తన నివాసంలో గృహనిర్మాణ అధికారులతో ప్రత్తిపాటి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి పీడీ ఎస్.వేణుగోపాల్, ఈఈ బి.శివలింగం, మండలాల ఏఈలు, కూటమి నేతలు హాజరయ్యారు. సమావేశంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద 2014-19, 2019-24 మధ్య వివిధ విభాగాల కింద మంజూరైన ఇళ్లు, అసంపూర్తిగా నిలిచిన, పూర్తయిన ఇళ్ల వివరాలు, లబ్ధిదారుల సమాచారంపై ఆయన అధికారుల్ని ఆరాతీశారు. 2014-19 మధ్య వివిధ దశలలో 1,820ఇళ్లు, 2019-24 మధ్య దాదాపు 2,652ఇళ్లు నిలిచిపోయాయని అధికారులు చెప్పారు. వాటిని వాటి పునః నిర్మాణంపై దృష్టిపెట్టాలని ఆయన ఆదేశించారు. లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం అందించే చేయూత గురించి తెలియచేసి, ఇళ్లు పూర్తయ్యేలా చూడాలన్నారు. 2014-19 మధ్య ఆగిపోయిన ఇళ్లకు రూ.1,61,000, 2019-24 మధ్య నిలిచిపోయిన ఇళ్లకు రూ.1,80,000లు కూటమి ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధమైన విషయం లబ్ధిదారులకు తెలియచేయాలన్నారు. అందులో అదనంగా బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.70వేలు ఇవ్వనున్న విషయం తెలియచేయాలని, ప్రభుత్వ సాయం అందుతుందనే నమ్మకం కలిగితే లబ్ధిదారులు ఇంటి నిర్మాణంపై దృష్టి పెడతారని అన్నారు. పీఎంఏవై తొలి దశ ఇళ్ల నిర్మాణ సమస్యల్ని కూడా వెంటనే పరిష్కరించాలని ప్రత్తిపాటి అధికారులకు సూచించారు. రెండో దశ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇల్లు మంజూరుచేయాలని స్పష్టంచేశారు. ఇళ్ల నిర్మాణ ప్రక్రియను సులభతరం చేసే దిశగా ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంటోందని, పట్టణప్రాంతాల్లో 100గజాల్లోపు నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్ నుంచి మినహాయింపు ఇచ్చిందన్నారు. అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా చంద్రబాబు ప్రభుత్వం గ్రామాల్లోని పేదలకు 3సెంట్లు, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు 2సెంట్లు స్థలం ఇవ్వాలని నిర్ణయించిందని, దీనిపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో జనసేన నాయకులు తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, షేక్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

అంతర విశ్వవిద్యాలయాల నృత్యం, క్విజ్ పోటీల విజేత పీఎన్‌సీ అండ్ కేఆర్

నరసరావుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అంతర విశ్వవిద్యాలయాల నృత్యం, క్విజ్ పోటీలలో పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ జీ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. విజయవాడలోని పీబీ సిద్దార్థ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన నృత్య పోటీలలో స్రవంతి, మానస, ప్రవల్లిక, కరిష్మ ప్రథమ స్థానంలో నిలిచారు. క్విజ్ పోటీలో శ్రీకాంత్, సాయి ప్రథమ బహుమతి సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ప్రేమ్‌చంద్, అదనపు కార్యదర్శి పాలడుగు శ్రీనివాసప్రసాదు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


బొజ్జా రాములు (ఫైల్ ఫోటో)

వినుకొండ టౌన్, మార్చి 27, (ఆంధ్రజ్యోతి) అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలోని కొండ పొలాల్లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే నడిగడ్డ గ్రామానికి చెందిన బొజ్జా రాములు (53) పంట పొలాల్లో గుడి నిర్మించుకుని అక్కడ ఉండేవాడు. చెట్టు వద్ద మృతిచెంది ఉన్నట్లు అందిన సమాచారం మేరకు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యానాది సంఘాలు రాములు మృతిపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

ఇస్సపాలెం మహంకాళి దేవస్థానం ఆదాయం రూ.9.22 లక్షలు

నరసరావుపేట రూరల్, మార్చి 27, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సపాలెంలోని మహంకాళి ఆలయ హుండీల లెక్కింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆలయంలోని హుండీల ద్వారా రూ.9, 22,713 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి మాధవిదేవి తెలిపారు. అన్నదాన హుండీ ద్వారా రూ.95,884, ప్రధాన హుండీలా ద్వారా రూ.8,26,829 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహన అధికారి మాధవిదేవి తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి పర్యవేక్షకులు బండి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, మహిళా సేవా భక్త బృందం, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు వేగవంతం చేయాలి: జేసీ సూరజ్

నరసరావుపేట రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా లో నిర్వహిస్తున్న భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలనీ జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం భూ రీ సర్వే పనులపై జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎటువంటి రెవెన్యూ సమస్యలు ఉన్నా వెంటనే ఆర్డీవో, తహసీల్దార్, ఏడీ సర్వేయర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో, మూడు రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నీటితో రాష్ట్రం సస్యశ్యామలం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోలవరం నీటితో రాష్ట్రంలో కరవు లేకుండా చేయడమే చంద్రబాబు జీవితాశయం అని స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం పేర్కొన్నారు. జగన్ అవినీతి, అనాలోచనలకు బలైన పోలవరం ప్రాజెక్టు పూర్తికి కూటమి ప్రభుత్వం ధృఢ సంకల్పంతో పనిచేస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వ వంచనతో విసిగిపోయిన ప్రాజెక్టు నిర్వాసితులు ఒకానొకదశలో తమను తెలంగాణలో కలపాలని మొరపెట్టుకునే పరిస్థితికి వచ్చారన్నారు. గత ప్రభుత్వ మోసాలకు బలైన నిర్వాసితుల రక్షణే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

బొల్లాపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో పీ సీతారామయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ బత్తి రాములు మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు తదితరరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

నూజెండ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాల శిక్షణ ద్వారా ఉపాధి కలుగుతుందని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిరుద్యోగ యువతీ యువకులు సులభతరంగా దరఖాస్తు చేసుకునేలా క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడాప్ కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాటిక పోటీలలో సింగర కొండయ్య చౌదరికి ఉత్తమ బహుమతి

చిలకలూరిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మదిరలో ఏటా నిర్వహించే సీతారామాంజనేయ కళా పరిషత్ వారు తాజాగా నిర్వహించిన పౌరాణిక నాటిక పోటీలలో చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రముఖుడు గోరంట్ల సింగర కొండయ్య చౌదరి తన ప్రదర్శనతో ఉత్తమ బహుమతిని పొందారు. పాండవ ఉద్యోగ విజయంలో పోషించిన శ్రీకృష్ణుడి పాత్రకు గాను ఈ బహుమతి లభించింది.

1600 కుటుంబాలకు నిత్యావసరాల అందజేత

చిలకలూరిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణానికి చెందిన పఠాన్ చిన సత్తార్ ఖాన్ జ్ఞాపకార్థం వారి కుమారులు పఠాన్ సుభాని, పఠాన్ యూసుఫ్, పఠాన్ యాసిన్లు గురువారం 1,600 కుటుంబాలకు 15 రకాల నిత్యావసరాలను అందించారు. వీటిని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ గురువారం పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎ.రామకృష్ణ, నజీర్, ఎం.హరి, ఎ.వీరాఆంజనేయులు, జానీ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి రూ.20వేల ఆర్థికసాయం

చిలకలూరిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు దివంగత పఠాన్ మహబూబ్‌ఖాన్‌మేస్త్రి జ్ఞాపకార్థం పఠాన్‌సుభాని, పఠాన్ యూసుఫ్‌లు పేద కుటుంబానికి రూ.20వేల ఆర్థికసాయాన్ని గురువారం అందించారు. మురికిపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఈ మొత్తాన్ని పంపిణీ చేశారు.

బేస్‌బాల్ క్రీడాకారుడికి రూ.10వేలు ఆర్థికసాయం

వినుకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న బోధనం శ్రీనుకు జనసేన పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నాగశ్రీనురాయల్ గురువారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ తరపున అల్ ఇండియా గ్లోబల్ యూనివర్శిటీ పోటీలకు ఎంపికై త్వరలో ఛండీఘడ్‌లో జరిగే బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు శ్రీనుకు ఆర్థికసాయం అందజేసినట్లు నాగశ్రీను తెలిపారు. కార్యక్రమంలో లెనిన్‌మాస్టర్, పారెళ్ల అభిమన్యు, పసుపులేటి రజబాబు, కామిశెట్టి కిషోర్, తుమ్మా అనిల్‌కుమార్, లక్ష్మణరావు, బీజేపీ నాయకులు మహేష్, రమేష్, అడపాల చిరంజీవి, తెల్లమేకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూరినల్స్‌కు స్థల పరిశీలన

వినుకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్నాడు రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు యూరినల్స్, డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేసేందుకుగాను రోడ్డు పక్కనే ఉన్న ప్లాట్‌ఫాంను మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తన సిబ్బందితో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల సౌలభ్యం కోసం పాఠశాల సమీపంలో యూరినల్స్ డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రుణ మేళాకు 169 హాజరు

ఈపూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన క్రెడిట్ క్యాంపునకు 169 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. మొత్తం 292 మంది దరఖాస్తు చేసుకోగా గుండేపల్లి పంచాయితీ నుంచి రెండు దరఖాస్తులు రాగా అత్యధికంగా కొచ్చెర్ల నుంచి 76 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో కే ప్రభాకర్ చెప్పారు. ఈపూరు, ముప్పాళ్ళ, కొచ్చెర్ల బ్యాంకు మేనేజర్లు హాజరయ్యారు.

యడ్లపాడులో 95మంది...

యడ్లపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన రుణమేళాకు 95 మంది హాజరైనట్లు ఎంపీడీవో హేమలతా దేవి తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్‌ల రుణాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో 215మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జాకీర్‌హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉప సర్పంచ్ ఎన్నికలు

రొంపిచర్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు గ్రామాల్లో ఉప సర్పంచ్ ఎన్నికలు గురువారం జరగాల్సి ఉండగా ఐదింటిలో జరిగాయి. తురుమెళ్ళలో ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. అలవాల, అచ్చయ్యపాలెం, అన్నవరప్పాడు, కొత్తపల్లి, వడ్లమూడివారిపాలెం పంచాయతీలకు ఉప సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. అచ్చయ్యపాలెం, అన్నవరప్పాడు, వడ్లమూడివారిపాలెం ఉపసర్పంచ్ పదవులను తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులు కైవసం చేసుకున్నారు. అలవాల, కొత్తపల్లి పంచాయతీల ఉప సర్పంచ్ పదవులను వైసీపీ సానుభూతి పరులు కైవసం చేసుకున్నారు. అచ్చయ్యపాలెం ఉప సర్పంచ్‌గా గాడిపర్తి సత్యనారాయణ, అన్నవరప్పాడు ఉప సర్పంచ్‌గా గోపు వెంకటరెడ్డి, వడ్లమూడివారిపాలెం ఉప సర్పంచ్‌గా వడ్లమూడి రాంబాబు ఎన్నికయ్యారు. అలవాల ఉప సర్పంచ్‌గా పాపసాని వరలక్ష్మి ఎంపికయ్యారు. కొత్తపల్లి ఉప సర్పంచ్ పదవికి ఘంటా కోటేశ్వరరావు ఎంపికయ్యారు. ఎన్నికల అధికారులు ఎంపికైన ఉప సర్పంచ్‌లకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. తరుమెళ్ళ ఉప సర్పంచ్ ఎన్నిక ఎప్పుడు జరిగేది అధికారులు ప్రకటించాల్సి ఉంది.

చీకటీగలపాలెం ఉపసర్పంచ్‌గా అనంతలక్ష్మి

వినుకొండ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చీకటీగలపాలెం గ్రామ ఉపసర్పంచ్‌గా 3వ వార్డుకు చెందిన ములకా అనంతలక్ష్మిని సభ్యులు ఏకగ్రీవంగా గురువారం ఎన్నికయ్యారు. అనంతలక్ష్మికి ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు నియామక పత్రాన్ని అందజేశారు.

గుంటుపాలెం ఉపసర్పంచ్‌గా ఆంజనేయులు

గుంటుపాలెం (శావల్యాపురం) మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటుపాలెం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌గా 7వవార్డు సభ్యుడు మద్దినేని ఆంజనేయులును వార్డు సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈవోపీఆర్డీ పి.సుగుణ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఆంజనేయులుకు ఈవోపీఆర్డీ సుగుణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావులు నియామకపత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామసర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్న పచ్చవ తేజస్విని ఎనిమిది నెలల నుంచి అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఆంజనేయులు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. వినుకొండ రూరల్‌సీఐ ప్రభాకర్, ఎస్ఐ లోకేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. శానంపూడిలో జరగాల్సిన ఉపసర్పంచ్ ఎన్నిక 7వవార్డు సభ్యురాలు మృతి చెందడంతో వాయిదా పడింది.

కొండాయిపాలెం ఉపసర్పంచ్‌గా త్రివేణి

ఈపూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయిపాలెం పంచాయితీ ఉప సర్పంచ్‌గా తురిమెళ్ళ త్రివేణి ఎన్నికైంది. గురువారం పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే రత్నబాబు ఎన్నిక ధ్రువపత్రం త్రివేణికి అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎస్ రత్నం, పంచాయితీ కార్యదర్శి కృష్ణాంజనేయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాకాని ఉప సర్పంచ్‌గా వీరవసంతరావు

నరసరావుపేట రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం కాకాని పంచాయతీ ఉపసర్పంచిగా అప్పలనేని వీర వసంతరావు, అల్లూరివారిపాలెం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్‌గా ఎక్కంటి విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ ఎస్ఐ కిషోర్ బందోబస్తు నిర్వహించారు.

జంగాలపల్లిలో ఉప సర్పంచ్‌గా రామకృష్ణ

నూజెండ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం జరిగింది. మొత్తం ఎనిమిది మంది వార్డు మెంబర్లు ఉండగా 5వ వార్డు సభ్యుడైన ఎస్.రామకృష్ణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కే చిన వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే రబ్బానీ, టీడీపీ నాయకులు పాల్గొని రామకృష్ణకు అభినందనలు తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన కొమ్మాలపాటి


మంత్రి నారా లోకేశ్‌తో కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మానవ వనరుల అభివృద్ధి శాఖ, ఆర్టీజీఎస్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం కలిశారు. పల్నాడు జిల్లాలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఎంపీపీ, వైస్ ఎంపిపి, ఉప సర్పంచ్ ఎన్నికలలో కూటమి అభ్యర్థులు గెలుపొందినట్లు వివరించారు.

శ్రీకాకతీయ కమ్మవారి అన్నదాన సత్రానికి పలువురి విరాళం

బొందిలిపాలెం (శావల్యాపురం) మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకతీయ కమ్మవారి అన్నదాన సత్రంలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి పలువురు విరాళాలు సమర్పించినట్లు వ్యవస్థాపక కమిటీ సభ్యులు నాగుబడి వీరనారాయణ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని శానంపూడిశివారు బొందిలిపాలెంలోని శ్రీఅడవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద ఈ నెల 30వ తేదీన జరగనున్న తిరునాళ్ళ సందర్భంగా అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. మతుకుమల్లికి చెందిన ఆలూరి వెంకటనరసయ్య, నాగేశ్వరమ్మ దంపతులు, మిత్రబృందం గటిగంటి మురళీకృష్ణ, బోళ్ళ రవిప్రసాద్, మందపాటి సురేష్‌బాబులు సంయుక్తంగా రూ.40,116లను, కారుమంచికి చెందిన చుండూరి వెంకట్రావు, లక్ష్మీజ్యోతి దంపతులు, పొట్లూరుకు చెందిన యలవర్తి వీరాంజనేయులు, శివపార్వతి దంపతులు రూ.25,116లను, మతుకుమల్లికి చెందిన చింతా రమణారావు, శ్వేత దంపతులు రూ.20,116లను, మతుకుమల్లికి చెందిన మల్నీడి కర్ణుడు (బుజ్జి), లక్ష్మీ దంపతులు రూ.15,116లను, చిన్నకంచెర్లకు చెందిన దావులూరి శ్రీనివాసరావు (బ్రిటీష్), సుబ్బాయమ్మ దంపతులు రూ.15,116 సమర్పించినట్లు తెలిపారు. దాతలకు వ్యవస్థాపక కమిటీసభ్యులు బోడాల లక్ష్మయ్య, ముంద్రు రవణయ్య, బోడెపూడి వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు.

ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి: ఎంపీడీవో


పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో హేమలతాదేవి

యడ్లపాడు, మార్చి 27: యడ్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో హేమలతాదేవి కోరారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్, చిరునామాలో మార్పులు, చేర్పులు తదితర అంశాలన్నీ ఆధార్ కేంద్రంలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శశికళ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలను అరికట్టేందుకు బైండోవర్

శావల్యాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందిలిపాలెంలో ఈ నెల 30వ తేదీన జరగనున్న తిరునాళ్ళలో ప్రభల వద్ద రాజకీయ వివాదాలను అరికట్టేందుకు నిర్వాహకులపై బైండోవర్ కేసులను నమోదు చేస్తున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తిరునాళ్ళలో ప్రభలు ఏర్పాటు చేస్తున్న వివిధ గ్రామాల నిర్వాహకులపై గురువారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఒక్కో ప్రభకు ఐదుగురు సభ్యుల చొప్పున బైండోవర్ చేశామని, ప్రభల వద్ద ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే బైండోవర్ అయిన వ్యక్తులు బాధ్యత వహించాలన్నారు. కాబట్టి నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు.